ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 5 ఆగస్టు 2025 | 5


అర్జీదారుని సమస్య వింటున్న ఎస్పీ కృష్ణారావు

ఎస్పీ కార్యాలయంలో 29 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ నేరుగా అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి వారి సమస్యలను చట్ట పరిధిలో విచారించి పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయి అధికారులు పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు నిర్ణీత సమయంలో జిల్లా కార్యాలయానికి నివేదిక పంపించాలన్నారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఇతర సమస్యలపై 29 అర్జీలను స్వీకరించినట్టు తెలిపారు.


గోదావరి భవన్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

అర్జీల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ మహేష్‌కుమార్
- కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో 250 అర్జీల స్వీకరణ

అమలాపురం టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన అర్జీల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయి అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. అర్జీదారుడు అధికారులపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు ఎస్.మధుసూదన్, ఇన్‌చార్జి డీఆర్వో కె.మాధవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి, జీఎస్‌డబ్ల్యుఎస్ కోఆర్డినేటర్ రాజేశ్వరరావు తదితరులు మొత్తం 250 అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల కోసం ఆయా శాఖల సిబ్బందితోనే అర్జీలు రాయించారు. కార్యక్రమంలో వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర పాల్గొన్నారు.

అల్లవరం మండలంలో ఆక్వా చెరువులు


ఆక్వాను ఆదుకోరా?



- సబ్సిడీపై భూములు అడగడం లేదు..
- అడిగింది విద్యుత్ రాయితీ మాత్రమేనంటూ ఆక్వా రైతుల ఆవేదన
- అమెరికా అధ్యక్షుడి ప్రకటనతో తగ్గుతున్న రొయ్యల ధరలు
- ఆక్వా సమస్యలపై వ్యవసాయశాఖ, ఫిషరీస్ స్పందించాలి
- సంక్షోభంలోకి వెళుతున్న ఆక్వా పరిశ్రమ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఆక్వా కల్చర్‌పై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందనే వాదన వినిపిస్తోంది. గడిచిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆక్వా సేద్యం చేసే రైతులకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించకపోవడంతో ప్రస్తుతం ఈ పరిశ్రమ సంక్షోభంలోకి వెళుతోంది. దీనికితోడు అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటివరకు ట్రంప్ చేస్తున్న సుంకాల ప్రకటనలను సాకుగా చూపి రొయ్యల ఎగుమతిదారులు నిలువు దోపిడీ చేస్తుండడంతో రైతాంగం ప్రస్తుతం సాగును ఎక్కడికక్కడే నిలిపివేస్తున్నారు. ఓ చిన్న పరిశ్రమను నెలకొల్పడానికి ముందుకొచ్చే పారిశ్రామిక సంస్థలకు అడిగిందే తడవుగా ఎన్నో రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం ఆక్వాకల్చర్ ద్వారా లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమపై మాత్రం ఉదాసీనత ప్రదర్శిస్తోందని విమర్శలు వినవస్తున్నాయి. ముఖ్యంగా ఆక్వా సేద్యానికి ఇచ్చే విద్యుత్ రాయితీలను కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడమే ఇందుకు ప్రధాన కారణంగా రైతులు ఆరోపిస్తున్నారు.

ట్రంప్ ప్రకటనలతో కుదేలు

అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే, మళ్లీ ఇటీవల ఎగుమతులపై 25 శాతం సుంకం విధిస్తున్నామన్న ప్రకటన ఆక్వా సేద్యాన్ని కుదేలయ్యేలా చేసింది. ముఖ్యంగా రొయ్యల ఎగుమతిదారులంతా సిండికేట్‌గా మారి ధరలు తగ్గించి రొయ్యలను కొనుగోలు చేయడంతో పెట్టుబడులూ రాని నిస్సహాయ స్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఏటా పది లక్షల టన్నులు రొయ్యలను ప్రభుత్వాలు కొనుగోలు చేస్తున్నప్పటికీ వీటిలో రెండున్నర లక్షల నుంచి మూడు లక్షల టన్నులు.. అదీ 20, 30, 40 కౌంట్ రొయ్యలు మాత్రమే అమెరికా వంటి దేశాలకు ఎగుమతి అవుతాయి. ట్రంప్ విధించిన సుంకం అక్కడ రొయ్యలు కొనుగోలు చేసే వారిపైనే ప్రభావం చూపాలి అనేది వాస్తవం. కానీ ఆ ప్రకటనను సాకుగా చూపి ఇక్కడ గత ఏడు నెలల క్రితం ట్రంప్ చేసిన ప్రకటనతో ఆక్వా రైతుల నుంచి ధరలు తగ్గించి కొనుగోలు చేయడం వల్ల సుమారు రూ.1500 కోట్లు పైనే ఎగుమతి దారులు లబ్ధి పొందారనేది ఆక్వా రైతుల ఆరోపణ. ఇప్పుడు మళ్లీ అదే సాకుతో ధరలు తగ్గించి కొనుగోలు చేసేందుకు రొయ్యల వ్యాపారులు రైతులకు వేస్తున్న గాలంతో మళ్లీ దోపిడీ మొదలైంది. ఎక్కడో సుంకం విధిస్తే ఇక్కడ ధరలు తగ్గించి ఉత్పత్తిదారుడి నుంచి రొయ్యలు కొనుగోలుచేసి పెట్టుబడులూ రాకుండా వారిని ఆర్థికంగా నష్టం కలిగించడం ఎంతవరకు సమంజసమని ఆక్వా రైతుల అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు త్సవటపల్లి నాగభూషణం ప్రశ్నించారు. సుంకం విధిస్తే ఆ దేశంలో ధరలు పెరగాలి. ఇక్కడ ధరలు తగ్గుతున్నా బాధ్యత కలిగిన వ్యవసాయశాఖ మంత్రి, అధికారులు, ఫిషరీస్ ఉన్నతాధికారులు కనీసం స్పందించకుండా ఆక్వా సాగును సంక్షోభంలోకి వెళ్లేలా చేస్తున్నారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ఆక్వాసాగు ద్వారా కేంద్ర రాష్ట్రానికి డాలర్ల సిరులు కురిపించే ఈ రంగం కనుమరుగయ్యే ప్రమాదం ఉందనేది రైతుల ఆవేదనగా ఉంది.

ఏదీ ప్రోత్సాహం..?

- ఆక్వా సేద్యం చేస్తున్న రైతులకు ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు ప్రస్తుతం అమలుకు నోచుకోవడం లేదు.
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్షా 40వేల ఎకరాల్లో ఆక్వాసేద్యం జరుగుతోంది. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాతోపాటు మరో రెండు జిల్లాల నుంచే 60శాతం మేర ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి.
- ఆక్వాజోన్, నాన్‌ఆక్వాజోన్‌లు మొత్తం రద్దు చేసి నాలుగున్నర లక్షలు ఉన్న ఆక్వా సేద్యాన్ని 10 లక్షల ఎకరాలకు విస్తరింపచేసి ప్రోత్సహిస్తామన్న ప్రభుత్వ హామీ 14 నెలలు గడిచినా ఆచరణకు నోచులేదు.
- ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలుకాలేదు. ఉమ్మడి జిల్లాలో 12వేల కనెక్షన్లకు సబ్సిడీ ఇవ్వకపోవడం వల్ల ఆక్వా రైతులు ఆర్థిక సమస్యలతో ఉత్పత్తి చేయలేకపోతున్నారు.
- ఆక్వా సేద్యం వల్ల రొయ్యల ఎగుమతిదారులు, వాటి కంపెనీల్లో పనిచేసే వేల మంది కార్మికులకు ఉపాధి కలుగుతుంది.
- ప్రత్యక్షంగా, పరోక్షంగా కార్మికులు, ల్యాబ్ టెక్నీషియన్లు, టెక్నీషియన్లు, ఫీడు సరఫరా చేసే వ్యాపారులు, వాటి అనుబంధంగా వేల మంది కార్మికులు ఈ రంగంపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు.
- నాణ్యమైన సీడు సరఫరా చేయకుండా ఆఫర్ల పేరుతో నాణ్యతలేని రొయ్య సీడును రైతులకు అందించి వారు నిలువునా నష్టపోయేలా హేచరీలు చేస్తున్న కుట్రలను ప్రభుత్వం అరికట్టాలి.
- ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌లను రద్దుచేసి ఆక్వా రైతులకు పూర్తిస్థాయిలో విద్యుత్ సబ్సిడీని గతంలో మాదిరిగానే అంద రికీ అందించి ఆదుకోవాలనేది రైతుల డిమాండ్.

రైతుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

వైసీపీ నాయకులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు అర్జీ అందజేస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం టౌన్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ జిల్లాశాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి అర్జీ అందించారు. యూరియా కొరతను వెంటనే నివారించి రైతులందరికీ ఎరువులు అందుబాటులో ఉంచాలని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రభుత్వానికి సూచించారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమావేశాలు నిర్వహించి ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాక్ మార్కెట్‌ను పూర్తిగా నియంత్రించాలని, బ్లాక్ మార్కెట్ చేసేవారి లైసెన్సులను రద్దుచేసి వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎరువుల నిల్వలను రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రత్యేక యాప్ లేదా వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు. గతేడాది రైతు భరోసా సొమ్ముల బకాయిలను వెంటనే చెల్లించాలని పార్లమెంటు ఇన్‌చార్జి జక్కంపూడి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఉచిత పంటల బీమాను అమలుచేయాలని, తదుపరి అన్నదాత సుఖీభవన సొమ్ములు ఎప్పుడు చెల్లిస్తారో ముందుగా ప్రకటించాలన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు డాక్టర్ పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్యప్రకాష్, పితాని బాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, నాయకులు జిన్నూరి బాబి, జిన్నూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రకృతి వ్యవసాయంవైపు రైతులను ప్రోత్సహించాలి'

ముమ్మిడివరం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సేద్యంలో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ సేద్యం వైపు రైతులను ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ కె.శ్రీనివాస్ సూచించారు. వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ముమ్మిడివరం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు సంబంధించిన రైతు సేవా కేంద్రం సిబ్బందికి సామాజిక ప్రకృతి వ్యవసాయ సేద్యంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ సేద్యంలో రసాయనిక ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వినియోగించడం వల్ల వాటి అవశేషాలు ఆహార ఉత్పత్తుల్లో ఉండి ప్రజల ఆరోగ్యానికి హానిచేస్తున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితోపాటు నాణ్యమైన ఉత్పత్తులు పొందవచ్చన్నారు. వ్యవసాయ అధికారులు ఎస్.ప్రశాంత్‌కుమార్, ఎం.వాణి, మృదుల మాట్లాడుతూ సేద్యంలో నత్రజని వాడకాన్ని తగ్గించుకోవడం ద్వారా చీడపీడలను అధిగమించడమే కాకుండా నాణ్యమైన, ఆరోగ్యవంతమైన దిగుబడులు పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ ఎ.ఏడుకొండలు రైతు సేవా కేంద్ర సిబ్బందికి, ప్రకృతి వ్యవసాయ సేద్యంపై సూచనలు, సలహాలిచ్చారు. ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ అసోసియేట్ అనంత్‌కుమార్ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, టి.విజయ్‌కుమార్ శాస్త్రీయతపై వీసీ ద్వారా వివరించారు.

లిక్కర్ 'బంద్'

- మామూళ్ల పేరుతో ఎక్సైజ్ అధికారులు వేధిస్తున్నారంటూ ఆరోపణ
- అమలాపురం నియోజకవర్గంలో 19 మద్యం షాపులకు తాళాలు
- ఎక్సైజ్ సీఐ కార్యాలయం ఎదుట వ్యాపారులు, సిబ్బంది నిరసన
- ఉన్నతాధికారుల రంగ ప్రవేశం



అమలాపురం పట్టణంలో మూతవేసిన మద్యం షాపు

అమలాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మామూళ్ల పేరుతో ఎక్సైజ్ అధికారులు నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ అమలాపురం పట్టణం సహా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మద్యం షాపులన్నింటినీ సోమవారం ఆకస్మికంగా మూసివేసి వ్యాపారులు, సిబ్బంది నిరసన తెలిపారు. మద్యం షాపుల తాళాలను అమలాపురంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి తీసుకువెళ్లి టేబుల్‌పై పెట్టేశారు. నిబంధనల పేరుతో షాపుల్లోకి వచ్చి అక్రమంగా కేస్‌లను పట్టుకువెళ్లడంతోపాటు మామూళ్ల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని వారు ఆందోళనకు దిగారు. అమలాపురం పట్టణం, అల్లవరం, ఉప్పలగుప్తం, రూరల్ మండలాల పరిధిలో మొత్తం 19 మద్యం దుకాణాలు ఉన్నాయి. నిబంధనల పేరుతో షాపులు తీసేసరికి ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ షాపులోకి వచ్చిన కావాల్సిన మద్యం బాటిళ్లను తీసుకువెళ్లడంతోపాటు సిబ్బంది, వ్యాపారులను వేధింపులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న మద్యం దుకాణాలు మూసివేసి విక్రయాలు జరగకుండా తాళాలువేసి సీఐ కార్యాలయానికి అందజేయడంతో విషయం ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లింది. ప్రధానంగా నిబంధనల పేరుతో నిత్యం వేధించడమే కాకుండా ఎక్సైజ్‌శాఖ అధికారుల పేరుతో షాపునకు వచ్చి రూ.70వేలకు పైగా మామూళ్ల రూపంలో నెలసరి చెల్లిస్తున్నామంటూ వ్యాపారులు మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని మద్యం షాపులుంటే వాటికి నోటీసులు ఇచ్చి షాపులు సీజ్ చేయాలే తప్ప తనిఖీల పేరుతో వేధింపులకు దిగడం ఎంతవరకు సమంజసమని వారు ఆవేదన చెందారు. దీనిపై స్పందించిన సీఐ సత్యనారాయణ వివరణ ఇచ్చారు. తాను ఎవరినీ వేధింపులకు గురిచేయలేదని చెప్పారు. షాపుల్లో మద్యం విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని, జంక్ ఫుడ్, వాటర్ ప్యాకెట్లు అమ్మకూడదన్న నిబంధనలు పట్టించుకోవడంలేదని సత్యనారాయణ చెప్పారు. ప్రభుత్వం విధించిన నిబంధనలు అమలుచేయని వారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మామూళ్ల విషయంలో ఎవరిపైనా ఒత్తిడి లేదని ఖండించారు. అయితే ఈ వ్యవహారం సీరియస్‌గా మారి పట్టణంలో రాజకీయ వర్గాల్లో సైతం చర్చకు దారితీయడంతో ఎక్సైజ్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని సర్దుబాటు చేసినట్టు సమాచారం.


ఎక్సైజ్ సీఐ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వ్యాపారులు, సిబ్బంది

రియల్ 'చాన్స్'!

ఎల్ఆర్ఎస్ మొదలైంది



- అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణ
- కూటమి సర్కారు అవకాశం
- జూలై 26న నోటిఫికేషన్
- 90 రోజులపాటు అమలు
- గతంలో 10,366 అప్లికేషన్లు
- 6,080 దరఖాస్తులకు ఓకే
- రియల్టర్ల ఆనందం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గతంలోను అవకాశమిచ్చినా ఎల్ఆర్ఎస్ స్కీం అర్ధంతరంగా నిలిచిపోయింది. అప్పట్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు తాజాగా దానికి కొన్ని సవరణలు చేస్తూ గత నెల 26న దీనికి సంబంధించి జీవో విడుదల చేసింది. అందులో ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు రిజిస్టరయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. దీనికి అక్టోబరు 24వ తేదీ వరకు గడువు ఇచ్చింది. అలాగే దరఖాస్తుదారులకు ప్రభుత్వం పలు రాయితీలను సైతం ప్రకటించింది.

గతంలో 10,366 మంది దరఖాస్తు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అక్రమ, అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గతంలో 10,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. రూ.47.98 కోట్ల పాక్షిక అపరాధ రుసుం చెల్లించారు. వీటిలో 6,080 దరఖాస్తులు అప్రూవల్ అయ్యాయి. 990 దరఖాస్తులు తిరస్కరించారు. 1327 దరఖాస్తులకు షార్ట్ ఫాల్ నోటీసులు ఇచ్చారు. 379 దరఖాస్తుదారులు డబ్బులు చెల్లించాల్సి ఉంది. 1580 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. అనంతరం ఎల్ఆర్ఎస్ స్కీం అర్ధంతరంగా నిలిచిపోయింది. దీనికి కొన్ని సవరణలు చేసి 2025 జూన్ 30లోపు రిజిస్టర్ అయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లు అర్హత కలిగినవిగా సవరిస్తూ జీవోఎంఎస్ నెం.134ను 2025 జూలై 26న జారీ చేసిన నాటి నుంచి 90 రోజులు అంటే అక్టోబరు 24వ తేదీలోపు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోకపోతే నేరంగా పరిగణిస్తారు. అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్లకు విద్యుత్, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వంటి వసతులు కల్పించరు. భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయరు. అనధికార లేఅవుట్లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్‌శాఖ నిషేధిత ఆస్తుల జాబితాలో నమోదు చేస్తారు. దీంతో అమ్మకం, కొనుగోలు లావాదేవీలు జరపడం సాధ్యంకాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

అక్టోబరు 24 వరకు అవకాశం



అనధికార లేఅవుట్లు,ప్లాట్ల యజమానులకు గుడ్‌న్యూస్.. అక్టోబరు 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరించుకోవాలి.

- రాహుల్ మీనా, జేసీ, వైస్‌చైర్మన్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కాకినాడ

దరఖాస్తు ఇలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా), రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా), పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా),అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) పరిధిలో అర్హత కలిగిన అనధికార లేఅవుట్ల యజమానులు, అనధికార లే అవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు తమ అనధికార లేఅవుట్ల, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ పోర్టల్ https:// dtcp.ap. gov.in వెబ్‌సైట్‌లో నేరుగా సిటిజన్ లాగిన్ లేదా ఆయా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల్లో లైసెన్సు పొందిన ఎల్టీపీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

రాయితీలు..


క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నవారు ఓపెన్ స్పేస్ చార్జీలపై 50శాతం రాయితీ పొందుతారు.సెప్టెంబరు 19వ తేదీలోపు ఫీజు చెల్లిస్తే పెనాల్టీ చార్జీలపై 5 శాతం తగ్గింపును పొందుతారు. 4 వేల చదరపు మీటర్లలోపు విస్తీర్ణం గల వ్యక్తిగత స్థలాలు ప్రభుత్వ రహదారి, ఇప్పటికే ఉన్న రహదారి సదుపాయం కలిగి అనధికార లేఅవుట్లలో భాగంకాకపోతే వాటిని క్రమబద్ధీకరించుకునే అవకాశం కలుగుతుంది. రాయితీలు పొందొచ్చు.

కాకినాడలో అర్ధరాత్రి మొదలైన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

7




కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో పోలీసు, ఆర్మీ అధికారులు.. హాజరైన యువకులు



విద్యార్థులకు పాస్‌పోర్టు ఇస్తున్నారు. అయితే ఇది మన గుర్తింపును తెలియజేసే పాస్‌పోర్టు లాంటిది కాదు. అమ్మ పేరుతో మొక్కలు నాటినందుకు ఇచ్చే గ్రీన్‌పాస్‌పోర్టు. ఇందులో విద్యార్థులకు సంబంధించిన, నాటిన మొక్కల వివరాలు నమోదు చేయడంతో పాటు ఎదుగుదల ఆధారంగా పాయింట్లు ఇస్తారు. విద్యార్థి ఫొటోతో ఉండే ఈ గ్రీన్ పాస్‌పోర్టు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



విద్యార్థులకు పాస్‌పోర్టు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం)కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భారీగా హాజరుకావడం ద్వారా గిన్నిస్ రికార్డు సాధించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు విద్యార్థులతో మొక్కలు నాటించి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మెగా పీటీఎం నిర్వహించిన రోజునే ఈ కార్యక్రమాన్ని లాంఛనప్రాయంగా ప్రారంభించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కల పెంపకంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు వారికి గ్రీన్ పాస్‌పోర్టులు అందించాలని నిర్ణయించారు. అమ్మ పేరుతో ఇప్పటికే మొక్కలు నాటిన విద్యార్థులకు వీటిని అందజేస్తున్నారు. విద్యార్థి ఫొటో, వారు పెంచే మొక్కల వివరాలతో ఉన్న ఈ పాస్‌పోర్టు వారిలో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ పాస్‌పోర్టులు అందించిన తర్వాత మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చిన విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది.

అమ్మ పేరుతో....

మెగా పీటీఎంలో అమ్మకు వందనం పేరుతో విద్యార్థులతో వారి తల్లులకు పాదాభివందనం చేయించిన ప్రభుత్వం ఇప్పుడు అమ్మ పేరుతో



మొక్క (ఏక్ పేడ్ మా కే నామ్) పేరుతో వారిని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేసే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ఎన్ని మొక్కలు అవసరమో ముందుగానే వివరాలు సేకరించి వారికి వాటిని అందించారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇప్పటికే 3.50 లక్షలకు పైగా మొక్కలను విద్యార్థులకు అందించి నాటించారు. పాఠశాలల ఆవరణలు, ఖాళీ ప్రదేశాల్లో వీటి పెంపకం చేపట్టారు.

గ్రీన్ పాస్‌పోర్టు అంటే...

విద్యార్థి నాటిన మొక్క, ఆ విద్యార్థి వివరాలతో కూడినదే గ్రీన్ పాసుపోర్టు. దీనిని ఆకట్టుకునే విధంగా ఆకుపచ్చ రంగులో తీర్చిదిద్దారు. కవర్‌పై గ్రీన్ పాసుపోర్టు, అమ్మ పేరుతో మొక్క అని ఉంటుంది. మొదటి పేజీలో విద్యార్థి ఫొటో, పేరు, అపార్ ఐడీ, వయసు, పెన్ ఐడీ, పాఠశాల పేరు, చిరునామా ఉంటుంది. రెండో పేజీలో మొక్క పేరు, దాని శాస్త్రీయ నామం, ఏ రోజున మొక్క నాటారు, ఎక్కడ నాటారు, ఆ ప్రదేశం వివరాలను నమోదు చేయాలి. ఇక్కడి నుంచి మొక్క పెరుగుదులలో విద్యార్థి బాగస్వామ్యం మొదలవుతుంది. ఎప్పటికప్పుడు మొక్క పెరుగుదలను సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించుకోవాల్సి ఉంటుంది.

మొక్క ఎదుగుదల ఆధారంగా గ్రీన్ పాయింట్లు

మొక్క ఎదుగుదలను బట్టి విద్యార్థులకు గ్రీన్ పాయింట్లు లభిస్తాయి. గ్రీన్ పాసుపోర్టులో మై జర్నీ విత్ మై ప్లాంట్స్ గ్రోత్ కింద ప్రతినెలా మొక్క ఎదుగుదల స్థితి, గ్రీన్ పాయింట్లు నమోదు చేసి క్లాస్ టీచర్ సంతకం తీసుకోవాలి. గరిష్ఠంగా మూడు మొక్కల వివరాల నమోదు కు అవకాశం కల్పించారు. చివరి పేజీలో విద్యా సంవత్సరంలో విద్యార్థి సాధించిన గ్రీన్ పాయింట్లు, అచీవ్ అయిన గ్రీన్‌లెవెల్‌ను నమోదు చేయాలి.

మొక్కల కోసం ఏమి చేయాలి

అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి గల విద్యార్థుల వివరాలను ప్రతి పాఠశాలలో తీసుకుంటారు. వీరు కనిష్ఠంగా ఒకటి నుంచి మూడు రకాల వరకు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. ఇలా ఎంపిక చేసుకోగానే పేరు, అపార్ ఐడీ వివరాలను ఉపాధ్యాయులు రిజిస్టర్ చేస్తారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో ఈ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అటవీ శాఖ సూచించిన నర్సరీ పాయింట్ల వద్దకు వెళ్లి విద్యార్థులు కోరుకున్న మొక్కలను పాఠశాలకు తీసుకువచ్చి వారికి ఎంఈవోలు, ఉపాధ్యాయులు అప్పగించాలి. ఇందుకు విద్యా శాఖ, సమగ్ర శిక్షా ద్వారా ప్రతి మొక్కకు రవాణా, ఇతర చార్జీలుగా రూ.7.85 మంజూరు చేశారు. ఈ విధంగా వచ్చిన తర్వాత విద్యార్థులు మొక్కలు నాటి సెల్ఫీ తీసుకోవాలి. ఈ ప్రక్రియను లీప్ యాప్ ద్వారా పూర్తి చేయాలి.



- పాఠశాలల్లో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం
- మొక్కలు నాటిన వారికి గ్రీన్ పాస్‌పోర్టు
- విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం
- ఇప్పటికే 3.50 లక్షల మొక్కలు అందజేత



మొక్క ఎదుగుదల, సాధించిన పాయింట్లు వివరాల నమోదు పత్రిక

విద్యార్థులు ఆసక్తిగా ముందుకొస్తున్నారు

పి.వేణుగోపాలరావు సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఏపీసీ)



అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు విద్యార్థులు ఆసక్తిగా ముందుకు వస్తున్నారు. వీరికి ఇచ్చే గ్రీన్ పాస్‌పోర్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మ కోసం మొక్క నాటడాన్ని విద్యార్థులు బాధ్యతగా ఫీలవుతున్నారు. కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో గల 1,672 పాఠశాలల్లో విద్యార్థుల కోసం 1,90,788 మొక్కలను కేటాయించగా ఇప్పటిదాకా 1,20,917 మొక్కలను నాటారు. వీరి కోసం పాఠశాలలకు సమగ్ర శిక్షా ద్వారా 2.20 లక్షల గ్రీన్ పాసుపోర్టులను అందించాం. ఈ కార్యక్రమం నిరంతరాయం జరుగుతోంది. మొక్కల సంరక్షణలో విద్యార్థులను భాగస్వాములు చేయడం ద్వారా వారికి పర్యావరణ పర్యవరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం, అమ్మ ప్రాముఖ్యతను వివరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.


అంతర్వేదిలో సముద్రానికి 10 మీటర్ల దూరంలో సాగు చేస్తున్న నువ్వుల చేను

సముద్ర తీరం చెంత నువ్వుల సాగు

కొబ్బరి తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న రైతు దేవదాసు

అంతర్వేది, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీరంలో అంతర్వేదికి చెందిన రైతు కొల్లాబత్తుల దేవదాసు నువ్వుల పంట సాగు చేస్తున్నాడు. కొబ్బరి తోటలో అంతర పంటగా ఎకరం భూమిలో అర ఎకరం నువ్వు చేను సాగుకు కేటాయించాడు. వేసవికాలాన్ని సైతం లెక్క చేయకుండా సముద్ర ఇసుకలో సాగు ప్రారంభించి రెండు నెలలు అయ్యింది. మూడు నెలలకు పంట చేతికి వస్తుందని రైతు చెప్తున్నాడు. 50 కిలోల నువ్వుల వరకు పంట దిగుబడి వస్తుందని ఆశాబావం వ్యక్తం చేస్తున్నాడు. కొబ్బరి మొక్కలు వేసి ఐదు సంవత్సరాలు అయ్యిందని, ప్రస్తుతం కాపు వచ్చిన ఈ తోటలో నువ్వు సాగు చేయాలనే ఆలోచన మొదలైందని చెప్పాడు. గతంలో వేరుశనగ వేయగా అధికదిగుబడి వచ్చిందన్నారు. ప్రస్తుతం సరుగుడు తోటలకు డిమాండ్ లేదన్నారు. అర ఎకరంలో వేసిన నువ్వుల పంట చేతికి వచ్చిన తర్వాత మరింత ఎక్కువ సాగు చేస్తానని వివరిస్తున్నాడు. నువ్వులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని, ప్రస్తుతం అంతర్వేది ప్రాంతంలో నువ్వుల సాగులో దిగుబడి బాగుంటే మరింతమంది రైతులు ముందుకొచ్చే అవకాశం ఉందరు. వేసవిలో వేసిన ఈ నువ్వుల పంటకు మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీరం



దించామన్నారు. చుట్టుపక్కల సముద్ర తీర ప్రాంతంలో ఉప్పు నీరు, ఉప్పు గాలి అధికంగా ఉంటుందన్నారు. ఈ ప్రాంత నేలలను సారవంతమైనవిగా మారిస్తే అన్ని పంటలూ పండించుకునేందుకు అనువుగా ఉంటాయన్నారు. జామ, మామిడి, జీడిమామిడి, కూరగాయల పంటలు పండించేందుకు అనుకూలంగా ఉంటాయన్నారు. ఫెన్సింగ్ వేసి పశువులు, పక్షులు రాకుండా పంటను జాగ్రత్తగా చూసుకుంటున్నారు. సముద్రపు నీరు రాకుండా జాగ్రత్తలు పాటిస్తే అంతర్వేది ప్రాంత భూములు మరింత సారవంతంగా మారి పంటలు పండించడానికి అనుకూలంగా ఉంటాయని రైతు దేవదాసు చెప్పాడు.

ఆప్కాబ్ ఆవిర్భావ వేడుకల్లో డీసీసీబీ చైర్మన్ తుమ్మల


ఆప్కాబ్ ఆవిర్భావ వేడుకల్లో తుమ్మల బాబు

పెద్దాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) 62వ ఆవిర్భావ వేడుకలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) సోమవారం హాజరయ్యారు. విజయవాడలో జరిగిన ఈకార్యక్రమానికి సహకార శాఖా మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీబీ చైర్మన్లు, అధికారులు హాజరయ్యారని బాబు తెలిపారు. సహకార వ్యవస్థ ద్వారా రైతులకు మరిన్ని మెరుగైన సేవలందించడం, సహకార రంగంపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవడంతో పాటు స్థిరమైన సమగ్రతతో కూడిన వ్యవస్థను రూపొందించడం, రుణాల మంజూరు, తదితర విషయాలపై ఈ సమావేశంలో చర్చించినట్టు బాబు పేర్కొన్నారు.

మందేశ్వరస్వామిని దర్శించుకున్న గాయకుడు మనో


శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మనో

కొత్తపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయకుడు మనో కుటుంబ సమేతంగా సోమవారం మందపల్లి మందేశ్వర(శనేశ్వర)స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయార్చకులు ఆయనకు స్వాగతం పలికారు.ఆపై మనో కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన కుటుంబంతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్టు మనో తెలిపారు. అనంతరం ఆలయ ఈవో డి.సురేష్‌బాబు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ చింతం విజయకృష్ణమోహన్ పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు అర్జున్-ప్రణీత్ ఎంపిక



కడియం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ అండర్-14 జాతీయస్థాయి పోటీలకు కడియం గ్రామానికి చెందిన దాసరి నాగవెంకట అర్జున్, రాజమహేంద్రవరానికి చెందిన ఎం.ప్రణీత్ ఎంపికైనట్టు కోచ్ నాగులకొండ వీరభద్రరావు తెలిపారు. ఇటీవల సికింద్రాబాద్ స్కూల్ గేమ్స్ ఆంధ్రా, తెలంగాణ రీజనల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో అర్జున్-ప్రణీత్ జోడీ మొదటి స్థానంలో నిలిచింది. దీంతో వీరి జోడి సెప్టెంబర్ 24, 25 తేదీల్లో తమిళనాడులో జరిగే పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు


పవిత్రోత్సవ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

ఆత్రేయపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సకల దోశ పరిహారార్థం తిరుమల తరహాలో ఏటా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాలు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు వసంత మండపంలో నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ఉత్సవమూర్తులను అలంకరించి విశ్వక్సేన పూజ, పుణ్యహవచనం, దీక్షాధారణ, అకల్మస హోమం నిర్వహించారు. ఉపకమిషనరు ఈవో నల్లం సూర్య చక్రధరరావు పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం అంకుర్పారణ,నవమూర్తి ఆవాహన, పంచసయ్యాదివాసం తదితర కార్యక్రమాలను వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.2,96,515 లభించింది.

నన్నయలో ఎంటర్‌ప్రెన్యూర్ అభివృద్ధి కేంద్రం!

ఉపకులపతి ప్రసన్నశ్రీ


నందగోపాల్‌ను సన్మానిస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ వర్శిటీకి హైదరాబాద్ నుంచి ఇండస్ట్రియల్ కన్సల్టెంట్ నందగోపాల్ సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై వారు చర్చించారు. ఈ వివరాలను వీసీ తెలుపుతూ ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వశాఖ నుంచి ఉపయోగకరమైన ప్రాజెక్టులు తీసుకొచ్చి వ్యవస్థాపకత, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు విద్యాసంబంధాలను పెంపొందించడంపై దృష్టిసారించాలన్నారు. డిజైన్ అభివృద్ధి మేధోసంపత్తి హక్కులకు మద్దతు ఇవ్వడం ద్వారా ఆవిష్కరణ, వ్యవస్థాపకతను పెంపొందించడం లక్ష్యంగా నన్నయ వర్శిటీని హోస్ట్ ఇనిస్టిట్యూట్‌గా ముందుకు తీసుకెళ్తామన్నారు. నందగోపాల్ మాట్లాడుతూ మంత్రిత్వ శాఖల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ప్రాజెక్టులు తీసుకొస్తానని, తద్వారా విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగ కల్పన విభాగాధికారి ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, కామర్స్, మేనేజ్మెంట్ విభాగాధిపతి ఆచార్య ఉమామహేశ్వరీదేవి పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతపై దృష్టిపెట్టాలి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ
- జేఎన్టీయూకేలో దీక్షారంభ్ కార్యక్రమం ప్రారంభం



జేఎన్టీయూకే, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై దృష్టిపెట్టాలని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. జేఎన్టీయూకేలోని ఎస్ఈకేలో మొదటి సంవత్సరం విద్యార్థులకు దీక్షారంబ్ కార్యక్రమాన్ని ఈనెల 16 వరకూ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం సోమవారం ప్రారంభం కాగా మొదటి రోజు ఇండక్షన్ కార్యక్రమానికి లక్ష్మీనారాయణ విచ్చేసి మాట్లాడారు. భవిష్యత్‌లో ఏఐ టెక్నాలజీకి తగినట్లుగా ఉద్యోగవకాశాల కోసం, సివిల్ సర్వీసెస్ సాధించడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకుని కృషిచేయాలని సూచించారు. అంతే కాకుండా యువత స్మార్ట్ ఫోన్, చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా గ్రంథాలయం, క్రీడా వసతులను వినియోగించుకుని భవిష్యత్‌లో యూనివర్శిటీకి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్ దీక్షితులు, స్వరూపారాణి, సమన్వయకర్తలు జయప్రసాద్, డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ ఎస్.సత్యవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణ మాణిక్యాంబ

అమ్మవారికి స్వర్ణపూత కవచం అందజేసిన మాజీ మంత్రి వేణు కుటుంబం


స్వర్ణకవచాలంకృత మాణిక్యాంబ అమ్మవారు

ద్రాక్షారామ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయం లో ద్వాదశ శక్తిపీఠంగా పూజలు అందుకుంటున్న మాణిక్యాంబ అమ్మవారికి సోమవారం మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దంపతులు స్వర్ణపూత కవచం(చీర) సమర్పించారు. ఉదయం కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న వేణు దంపతులు, కుమారుడు నరేన్ దంపతులు భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం వేణు దంపతులు అమ్మవారికి స్వర్ణ పూతకవచం సమర్పించగా అర్చకులు సంప్రోక్షణ పూజలు చేసి అమ్మవారికి అలంకరించారు. దర్శన అనంతరం వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ, జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీలు శాకా బాబి, నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు యల్లమల్లి సతీష్‌కుమార్, అంబటి తుకారాం, పెమ్మిరెడ్డి దొరబాబు, కట్టా గోవిందు, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, వాసంశెట్టి శ్యామ్, కోటిపల్లి అబ్బు, భజన భక్త సమాజం సభ్యుడు బోనం శ్రీను పాల్గొన్నారు.

బతుకు బండి.. ఇలాగైతే ఎలాగండీ!?

రాజమహేంద్రవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోలో తన తోపుడు బండిని అతి కష్టంపై ఆటోకు కట్టుకొని తీసుకెళుతున్న ఆ మహిళ చిరు వ్యాపారి. ఏవీఏ రోడ్డులోని వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో తోపుడు బండిపై కూరగాయలు అమ్ముకొని జీవనం సాగిస్తోంది. ఆమెకు దివ్యాంగుడైన ఒక కుమారుడు ఉన్నాడు. ఆమెకిదే బతుకుబండి.. ఇదిలా ఉండగా రోడ్డు పక్కన ఉన్న తోపుడు బండిని నగరపాలక సంస్థ సిబ్బంది లాక్కెళ్లిపోయారు. సోమవారం ఉదయం వచ్చిన ఆమె, బండి లేకపోవడంతో లబోదిబోమంది. స్థానికులు చెప్పడంతో నగరపాలక సంస్థ కార్యాలయానికి పరుగు పెట్టింది. రూ.500 జరిమానా చెల్లిస్తేనే బండిని ఇస్తామని మునిసిపల్ సిబ్బంది సెలవిచ్చారు. అయితే ఆమె వద్ద రూ.500 లేకపోవడంతో అప్పు చేసి ఆ సొమ్ములు చెల్లించింది. ఆ బండిని ఆటోకు కట్టి లాక్కెళుతుండగా బతుకు బండి ముక్కలైపోయింది. ఇది చూసిన స్థానికులు పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా చిరు వ్యాపారులపై ఈ జరిమానాలేంటని రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ సిబ్బంది తీరుపై మండిపడ్డారు.



ఆంధ్ర పాలిటెక్నిక్‌లో నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

ప్రిన్సిపాల్ జనార్దనరావు

కాకినాడ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిప్లొమా కోర్సుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జనార్దనరావు తెలిపారు. మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఆర్కిటెక్చర్, ఆటోమొబైల్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి మంగళవారం ఉదయం 11 గంటల నుంచి అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

కాండ్రకోట నూకాలమ్మకు వెండి ఆభరణాల బహూకరణ



పెద్దాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్ర కోట నూకాలమ్మకు విశాఖపట్నానికి చెందిన బండారు శ్రీనివాస సత్యేంద్ర-పద్మజ దంపతులు వెండి కవచం, ఆయుధ సహిత హస్తాలు, సూర్య చంద్రులను బహూకరించినట్టు ఈవో ఎం.రాంబాబురెడ్డి సోమవారం తెలిపారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.

ప్రయత్నం ఫలించే.. ప్రాణం నిలిచే!

ఆంబోతును సెప్టిక్‌ట్యాంకు నుంచి బయటకు తీసిన ఫైర్ సిబ్బంది



సెప్టిక్ ట్యాంకులో పడిపోయిన ఆంబోతు

అంబాజీపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సెప్టిక్‌ట్యాంకులో పడిపోయిన ఆంబోతు కోసం ఫైర్‌సిబ్బంది అవిశ్రాంతగా శ్రమించి బయటకు తీశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని అల్లాడస్వామినాయుడుకాలనీలో తొత్తరమూడి వెంకటర మణ ఇంటి ఆవరణలో 15అడుగుల లోతులో వరలతో సెప్టిక్‌ట్యాంకు నిర్మాణం చేపడుతున్నారు. సోమవారం సెప్టిక్‌ట్యాంకులో ఆబోంతు పడిపోయింది. దీంతో స్థానికులు అమలాపురం ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో 15 అడుగుల లోతులో పడిపోయిన ఆంబోతును 2 గంటలు శ్రమించి బయటకు తీశారు. అనంతరం ఆంబోతుకు ప్రాథమిక చికిత్స అందించారు.



బయటకు వచ్చిన ఆంబోతు



బయటకు తీసేందుకు శ్రమిస్తున్న ఫైర్ సిబ్బంది

పదరా.. పదరా.. పదరా..

- ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి భారీగా తరలివచ్చిన యువత
- కాకినాడలో సోమవారం అర్ధరాత్రి ప్రారంభమైన ర్యాలీ
- కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శారీరక దారుఢ్య పరీక్షలు

యువతరం తరలివచ్చింది. ఆర్మీ కొలువు కోసం కదిలివచ్చింది. భుజాన బరువైన బ్యాగులతో కాకినాడలో అడుగు పెట్టింది. దీంతో కాకినాడ జిల్లా క్రీడామైదానం మరోసారి కిటకిటలాడింది.



ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి వచ్చిన అభ్యర్థులు

కాకినాడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలోని జిల్లా క్రీడామైదానంలో సోమవారం అర్ధరాత్రి అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభమైంది. ఇప్పటికే తొలిదశలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన క్యాండెట్ అర్హత పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన పదివేలమంది యువత రెండో దశ ఎంపిక కోసం కాకినాడ జిల్లాకు చేరుకున్నారు. ఈ ర్యాలీలో మొత్తం 12 జిల్లాలతోపాటు యానాం అభ్యర్థులు కూడా పాల్గొననున్నారు. తేదీల వారీగా ఆయా జిల్లాల వారికి ఈవెంట్లు జరగనున్నాయి. ఆగస్టు 5వ తేదీన అల్లూరి సీతారామ రాజు జిల్లా, అనకాపల్లి, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అభ్యర్థులకు శారీరక దారుఢ్యపరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో ఆయా జిల్లాల అభ్యర్థులు సోమవారం రాత్రి పదిగంటలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనకాపల్లి, యానాం, పార్వతీపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ జిల్లాల అభ్యర్థులకు తర్వాత తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ముందుగా తరలివచ్చిన అభ్యర్థులకు జేఎన్‌టీయూకే క్రీడామైదానంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు.

రాత్రి ఒంటి గంటన్నర నుంచి..

తొలుత కాకినాడ జిల్లా క్రీడామైదానం ప్రధాన గేటు వద్ద నుంచి అడ్మిన్‌కార్డులను పరిశీలించి అభ్యర్థులను లోపలికి అనుమతించారు. తర్వాత కుడిపక్కన ఏర్పాటు చేసిన టెంట్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. దూరప్రాంతాలనుంచి వచ్చే విద్యార్థులు విశ్రాంతి తీసుకునేందుకు గుడారాలను ఏర్పాటు చేశారు. భోజనం, వసతి కల్పించారు. రాత్రి ఒంటి గంటన్నర దాటిన తర్వాత నుంచి 1.6 కేఎం పరుగు, ఇది 6.15 నిమిషాల్లో పూర్తి చేయాలి. ఇందులో ఎంపికైన వారు ఎత్తు, బరువు, ఛాతీ, లాంగ్ జంప్, జిగ్‌జాగ్, బ్యాలెన్స్, పుష్ అప్స్ వంటి ఫిజికల్ ఫిటెనస్ పరీక్షలు నిర్వహించారు. అర్హత సాధించిన విద్యార్థులకు మెడికల్ టెస్టులు, తర్వాత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటాయి.

ఆంబోతుకు అంత్యక్రియలు



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆంబోతుకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం- కొత్తపేట ప్రధాన రహదారిలో సోమవారం గొలకోటివారిపాలెం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఆంబోతు మృతిచెందింది. విషయం తెలుసుకున్న మోడేకుర్రు సర్పంచ్ కు డుపూడి రామలక్ష్మివెంకటేశ్వరరావు అక్కడికి చేరుకుని గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించి ఖననం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామపెద్దలు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా .. ఏడుగురు విద్యార్థులకు గాయాలు

హంసవరం ఏపీ మోడల్ స్కూల్‌కి వెళ్తుండగా ఢీకొన్న కారు

తుని ఏరియా ఆసుపత్రికి తరలింపు

తునిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం హంసవరం గ్రామ సమీపంలో సోమవారం ఉదయం విద్యార్థులతో వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో బోల్తా కొట్టింది. దీంతో ఏడుగురికి గాయాలయ్యాయి. రోజు మాదిరిగానే తుని మండలం మరువాడ గ్రామం నుంచి విద్యార్థులు ఆటో ఎక్కి హంసవరంలో గల ఏపీ మోడల్ స్కూల్‌కి వెళ్తుండగా కారు ఢీకొనడంతో ఆటో అదుపుతప్పి పంటపొలాల్లోకి బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు విద్యార్థులకు గాయాలు కాగా ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. విద్యార్థులు చెల్లాచెదురుగా పడిపోవడంతో తల, కాళ్లకు గాయాలయ్యాయి. కేకలు వేయడంతో ఆ ప్రాంతంలోని రైతులు, పాఠశాల ఉపాధ్యాయులు హుటాహుటిన చేరుకుని విద్యార్థులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలైన విద్యార్థులు అప్పన రావణ్‌కుమార్, కామిరెడ్డి కృపానంద, కామిరెడ్డి సాత్విక్, కిల్లాడి నవీన్ రాజు, రామ్‌చరణ్, ఉరుకోటి రవి, ఉరుకోటి పవన్, జి.ఈశ్వరికి వైద్యులు పరీక్షలు చేసి చికిత్స అందించారు. ఆటోను ఢీకొన్న కారు ఆగకుండా వెళ్లిపోవడంతో సీసీ ఫుటేజ్ ఆధారంగా కారును పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనతో ఏరియా ఆసుపత్రికి పరుగులు తీశారు. గాయాలతో ఉన్న తమ పిల్లలను చూసి కన్నీరు పెట్టుకున్నారు. ఘటనపై తుని ఎమ్మెల్యే దివ్య ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు.



బోల్తా కొట్టిన ఆటో



తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



తునిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటనపై తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకా రం.. కాకినాడ జిల్లా తుని తాండవ బ్రిడ్జిపై నా గరాజుపేట రైల్వే గేటు వైపు నుంచి తుని రైల్వేస్టేషన్ వైపు బ్రిడ్జిపై వ్యక్తి నడుచుకుని వస్తుండగా రైలు ఢీకొనడంతో మరణించాడు. మృతదేహంపై నలుపురంగు జీను ప్యాంట్, చింతపిక్క రంగు కట్‌డ్రాయరు ఉన్నాయన్నారు. ఎడమకన్నుకు అంధత్వం ఉందన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిస్తే సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కాకినాడ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సుమారు 40 నుంచి 45 ఏళ్ల ఉండే మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సీఐ కెవివి సత్యనారాయణ సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం బంధువులు గుర్తించేందుకు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతురాలి ఆచూకీ తెలిస్తే 08842379052, 9440796542లో సంప్రదించాలని సీఐ సత్యనారాయణ కోరారు.

అన్నీ ఏకపక్షమే..

కాకినాడలో నాల్గో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు



మ్యాచ్ ఆడుతున్న ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్ జట్ల సభ్యులు





క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న ఓ కోచ్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరుగుతోన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్‌షిప్‌లో భాగంగా సోమవారం నాల్గోరోజు మ్యాచ్‌లన్నీ ఏకపక్షంగానే జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, కాకినాడ అపోలో ఆసుపత్రి ప్రతినిధులు మ్యాచ్‌లను ప్రారంభించారు. కాకినాడ క్రీడా మైదానంలోని ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో 6 మ్యాచ్‌లు జరిగాయి. దాద్రానగర్ హవేలి- జమ్మూ కాశ్మీర్ జట్ల మధ్య మ్యాచ్‌లో దాద్రానగర్ హవేలీ 6-0తో విజయం సాధించింది. గుజరాత్, రాజస్థాన్ జట్ల మధ్య మ్యాచ్‌లో గుజరాత్ 3-2తో విజయం సాధించింది. మిజోరాం, తెలంగాణ మధ్య మ్యాచ్‌లో మిజోరం 15-0 తో విజయం సాధించింది. మణిపూర్, పుదుచ్చేరి మధ్య మ్యాచ్‌లో మణిపూర్ 9-1తో.. అస్సాం, కేరళ మ్యాచ్‌లో అస్సాం 5-1తో.. ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్ మధ్య మ్యాచ్‌లో ఢిల్లీ 7-1 తేడాతో విజయం సాధించాయి. మ్యాచ్‌లను కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్, హాకీ ఆంధ్ర సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు పర్యవేక్షించారు.

తల్లి, ఇద్దరు కుమార్తెల హత్య కేసు..

పోలీసుల అదుపులో నిందితుడు!

సామర్లకోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట సీతారామ దళిత కాలనీలోని ఓ ఇంటిలో తల్లి,ఇద్దరు కుమార్తెలను దారుణంగా హతమార్చిన వ్యక్తిని సామర్లకోట పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. శనివారం అర్ధరాత్రి ఈ హత్యోదంతం అనంతరం సామర్లకోట నుంచి సదరు అనుమానితుడు పొరుగు జిల్లాకు వెళ్లిపోగా సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు వెళ్లి మాటువేసి పట్టుకున్నట్టు సమాచారం. ఈ హత్యలకు సామర్లకోటకు చెందిన తలే సురేష్ పాల్పడినట్టు పోలీసుల వద్ద పక్కా సమాచారం లభించడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. అయితే ఈ హత్యలకు ప్రధాన కారణం వివాహేతర సంబంధమేనని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. స్థానిక కోట్లమ్మచెర్వు ప్రాంతానికి చెందిన సురేష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడని, మృతురాలి ఇంటికి గత కొంత కాలంగా రాకపోకలు సాగిస్తున్నట్టు సమాచారం పోలీసులకు లభించినట్టు తెలిసింది.

పోస్టుమార్టంలో విస్తుపోయే అంశాలు

హత్యకు గురైన తల్లి,కుమార్తెల మృతదేహాలకు పోస్టుమార్టం చేసిన వైద్యులు విస్తుపోయినట్టు విశ్వసనీయ సమాచారం. మాధురి తలభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యేలా కొట్టినట్టు, పెద్దకుమార్తె అయిన పుష్పకుమారిని తల పైభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యిందని తెలుస్తోంది. చిన్న కుమార్తె జెస్సీని తలపై కొట్టడంతో బాటు గొంతు, గుండెలపై తొక్కడంతో రిబ్స్ ఎముకలు విరిగిపోయినట్టు పోస్టుమార్టం సమయంలో వైద్యులు గుర్తించినట్టు సమాచారం.

పుట్టినరోజు వేడుకలకు వెళ్తూ...

లారీ ఢీకొని యువకుడి మృతి



సాయినవీన్ (ఫైల్)

దేవరపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పెదనాన్న మనవడి పుట్టిన రోజు వేడుకకు వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వెంకటనగర్‌కు చెందిన చెలమశెట్టి మహావీర సాయినవీన్ (25) తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటలోని శ్రీ లక్ష్మితులసి ఆగ్రో పేపర్ మిల్లులో డీసీఎస్ ఆపరేషన్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. రాజమహేంద్రవరంలో పెదనాన్న మనవడి పుట్టినరోజు వేడుకకు అశ్వారావుపేట నుంచి సోమవారం ఉదయం 11గంటలకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యలో గౌరీపట్నంలో జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి తల్లిదండ్రులు ఆరేళ్లక్రితం మృతిచెందారు. తమ్ముడు శివశంకర్ రాజమహేంద్రవరంలో డెకరేషన్ వర్క్ చేస్తున్నాడు. సాయినవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన దానయ్య

పెరవలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలో పల్లా దానయ్య (42) గ్రామంలో ఇళ్ల వద్ద విద్యుత్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామంలో కేబుల్ వైర్లు కట్టేందుకు పిలవడంతో వెళ్లాడు. విద్యుత్ స్తంభంపైకి కేబుల్ వైర్లు కట్టడానికి ఎక్కగా షాక్‌కు గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య ధనలక్ష్మితో పాటు చదువుకునే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ కుటుంబం బాధ వర్ణనాతీతంగా మారింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా శుభం నొఖ్వాల్



కొత్త సబ్‌కలెక్టర్ శుభం నొఖ్వాల్

రంపచోడవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం రెవెన్యూ సబ్ డివిజన్‌కు కొత్త సబ్‌కలెక్టర్‌గా 2023 బ్యాచ్‌కు చెందిన శుభం నొఖ్వాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా ఉన్న కల్పశ్రీ స్థానంలో ఈయన్ను నియమించారు. శుభం నొఖ్వాల్ రాజస్థాన్‌లోని గంగానగర్ ప్రాంతంలోని ఓ పల్లెటూరు నుంచి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఢిల్లీ విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న హన్సరాజ్ కళాశాలలో ఫిలాసఫీలో బ్యాచిలర్ డిగ్రీ చేసి సివిల్స్‌కు ఎంపికయ్యారు. ఈయన తండ్రి ఇంద్రజిత్ నొఖ్వాల్ రైల్వేలో సీటీఐగా పనిచేస్తుండగా, తల్లి శకుంతలావర్మ ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. శుభం నొఖ్వాల్ సోదరి స్వాతి నొఖ్వాల్ కూడా 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కాగా, ఈయన బావ కులదీప్ కూడా ఐఏఎస్ అధికారిగా ఉన్నారు. 2023 బ్యాచ్‌కు చెందిన ఈయన ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు ఎంపికై అసిస్టెంట్ కలెక్టర్‌గా ఎన్టీఆర్ జిల్లాలో పనిచేశారు. అనంతరం ఈయనను రంప చోడవరానికి సబ్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇదిలాఉండగా రంపచోడవరం ప్రస్తుత సబ్ కలెక్టర్ కల్పశ్రీకి పదోన్నతిపై అల్లూరి జిల్లాలోనే ఏదో ఐటీడీఏకు ప్రాజెక్టు అధికారిగానో లేక రాజమండ్రి, కాకినాడ జిల్లాల్లో ఏదో ఒకచోట ముఖ్య పోస్టులలో నియమిస్తారన్న ప్రచారం సాగుతోంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతిపై కేసు



మృతిచెందిన వ్యక్తి

రాయవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి నట్టు రాయవరం ఎస్ఐ డి. సురేష్ బాబు సోమవారం రాత్రి విలేకర్లకు తెలిపారు. కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని పసలపూడి చైతన్య రైస్‌మిల్లు సమీపంలో సుమారు 70 ఏళ్ల కలిగిన గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించిన స్థానికులు 108 సహాయంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9440904843కు ఫోన్ చేయాలని ఎస్ఐ కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పి.గన్నవరం విద్యార్థి



సందీప్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం ఉమాదేవి

పి.గన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు లాంగ్‌జంప్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం జడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి కలిగితి సందీప్ ఎంపికైనట్టు హెచ్‌ఎం కె.ఉమాదేవి తెలిపారు. ఈనెల3న రామచంద్రపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో జరిగిన పోటీల్లో అండర్-16 లాంగ్ జంప్‌లో సందీప్ మొదటిస్థానం, 60మీటర్ల పరుగుపందెంలో ద్వితీయస్థానం సాధించినట్టు చెప్పారు. సందీప్ ఈనెల 9,10,11న బాపట్ల జిల్లా చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.దుర్గాప్రసాద్, కె.బీమేంద్ర అభినందించారు.

పేకాటలో పట్టుబడ్డ అన్నవరం దేవస్థానం ఉద్యోగి

విచారణాధికారిగా డీసీ

అన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో పేకాట ఆడుతూ పట్టుబడ్డ అన్నవరం దేవస్థానం ఉద్యోగిపై విచారణకు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ బాబూరావును విచారణాధికారిగా నియమిస్తూ ఈవో సుబ్బారావు ఆదేశాలిచ్చారు. ఆయన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటారని దేవస్థానం వర్గాలు వెల్లడించాయి. ఇదిలాఉండగా సదరు ఉద్యోగి సోమవారం ఈవోను కలసి విజ్ఞాపన అందజేశారు.

స్వదేశానికి రప్పించండి

కువైట్‌లో అవస్థలు పడుతున్న ర్యాలి మహిళ



ఆవేదన వ్యక్తం చేస్తున్న ర్యాలికి చెందిన గుమ్మడి లక్ష్మి

ఆత్రేయపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన గుమ్మడి లక్ష్మి ఉపాధి నిమిత్తం మూడున్నర ఏళ్ల క్రితం దుబాయ్‌కి వెళ్లింది. అక్కడ నుంచి తిరిగి స్వగ్రామానికి వస్తున్న సమయంలో అక్కడ య జమానులు దొంగతనం నేరం మోపి కేసు పెడతానంటూ బెదిరిస్తూ తనను రాకుండా అడ్డుకుంటున్నారని ఆ మహిళ కన్నీటి పర్యాంతం చెందుతూ ఓ వీడియో పోస్టు చేసి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. 'నేను కువైట్‌లో చాలా కష్టాల్లో ఉన్నాను. నన్ను ఎలాగైనా మా గ్రామానికి రప్పించండి' అంటూ స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు ఎన్ఆర్ఐలు సంబంధిత అధికారులను వేడుకుంటుంది. నున్ను స్వదేశానికి రప్పించాలని ఆమె ప్రాథేయపడుతుంది.

వనదుర్గ ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు

తొలిరోజు బాలాత్రిపురసుందరి అలంకారం



బాలాత్రిపురసుందరిగా దర్శనమిస్తున్న వనదుర్గ అమ్మవారు



వనదుర్గమ్మకు సారె సమర్పిస్తున్న ఈవో వీర్ల సుబ్బారావు, కుటుంబసభ్యులు

అన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి శ్రావణ మాసోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటపారాధన నిర్వహించగా ఈవో, చైర్మన్ పండితులకు దీక్షావస్త్రాలను అందజేశారు. తొలిసారిగా అమ్మవారికి దేవస్థానం తరుపున సారెను సమర్పించారు. ఆషాఢమాసంలో సమర్పించాలని ముందుగా అనుకున్నా వైదికకమిటీ సూచనలతో శ్రావణమాసంలో అమ్మవారి ఉత్సవాల సమయంలో అందించాలని పేర్కొనడంతో ఈవో కుటుంబసభ్యులు, దేవస్థానం ఆలయ విభాగ అధికారులు, పండితులతో మేళతాలాల నడుమ సారె, చీరలు, గాజులు, ఇతర తీపి పదార్థాలను అందజేశారు. తొలిరోజున అమ్మవారు బాలాత్రిపురసుందరిగా భక్తులను అనుగ్రహించారు. పౌర్ణమి వరకు ఈ జాతర ఉత్సవాలు జరగనుండగా రోజుకొక అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారు. ప్రత్యేక పూజల్లో ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

- నిందితుడు తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండల వాసి
- ద్విచక్రవాహనం, 44.5 గ్రాముల బంగారం, 8 గ్రాముల వెండి ఆభరణాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తిరుపతిరావు వివరాలు వెల్లడించారు. అంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం ఎస్సీ పేట గ్రామానికి చెందిన గొర్రెల చిన్నబాబు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రామచంద్రాపురం కాలనీలో 4.5 గ్రాముల బంగారం, 8 గ్రాముల వెండి, ఆర్‌టీసీ కాలనీలో 40 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్టు తెలిపారు. మే 31న జోర్నకల్‌లో బైక్ చోరీ జరిగినట్టు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసును విచారిస్తున్న క్రమంలో సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నట్టు తెలిపారు. విచారించగా అతడు చేసిన 6 దొంగతనాలను ఒప్పుకున్నట్టు తెలిపారు. నిందితుడి నుంచి బంగారం, వెండి ఆభరణాలతో పాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆభరణాల విలువ రూ.1,00,000 ఉంటుందన్నారు. దొంగను పట్టుకున్న పోలీసు సిబ్బందిని అభినందిచారు.

అన్నదాన ట్రస్టుకు రూ.50వేలు విరాళం

ఐ.పోలవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకు చెందిన రూపమాధురి వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50వేల విరాళాన్ని సోమవారం ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాస రాజు అందించారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు.

మా సమస్యలు పరిష్కరించండి సార్!

● కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో సమస్యలపై వినతులు అందించారు.



బ్యాంకుల వేధింపులు అరికట్టాలని నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు



వితంతు పింఛన్ ఇప్పించాలని కోరుతున్న ముగ్గురు పిల్లలతో కడలి దుర్గాభవానీ

అమలాపురంటౌన్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఎవరి భూములో మా ఆధార్ కార్డుకు అనుసంధానమయ్యాయి. ఎవరెవరో విద్యుత్ మీటర్లు మా ఆధార్ కార్డులకు అనుసంధానం కావడంతో తల్లికి వందనం ఆగిపోయింది. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎందరో తల్లులు వేడుకున్నారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీజీఆర్ఎస్‌లో అర్జీలు అందించారు.

ప్రైవేటు బ్యాంకుల వేధింపులు అరికట్టాలి : కలెక్టరేట్ ఎదుట వివిధ సంఘాల నిరసన

అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి దళిత బలహీనవర్గాల మహిళలను వేధింపులకు గురిచేసి భౌతిక దాడులకు పాల్పడుతున్న ప్రైవేటు బ్యాంకుల ఆగడాలను అరికట్టాలని సీపీఎం, కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలో వివిధ ప్రైవేటు బ్యాంకుల నుంచి పిల్లల చదువులు, ఇంటి నిర్మాణాల కోసం రుణాలు తీసుకున్న వారు అధిక వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, గెడ్డం ఏసురాజు, విప్పర్తి మోహనరావు, దళితసేన జిల్లా అధ్యక్షుడు మెండి డేవిడ్ అంబేడ్కర్, గెడ్డం భీమ్లా, కొంబత్తుల ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర కెమికల్స్ లీకేజీని అరికట్టాలి మడుపల్లి గ్రామ రైతులు

అయినవిల్లి మండలం మడుపల్లిలో ఆరు ఎకరాల స్థలంలో ఓఎన్జీసీ సైట్ ఉంది. ఆ సైట్‌లో ఏర్పాటుచేసిన ట్యాంకులో ప్రమాదకరమైన కెమికల్స్ నిల్వ చేస్తున్నారు. అవి లీకై సమీపంలోని పంట పొలాలు దెబ్బతింటున్నాయి. మరో ఎకరాల భూములను సేకరించేందుకు రైతులతో సంప్రదించకుండానే ఓఎన్జీసీ సర్వే నిర్వహిస్తుంది. సర్వేను నిలుపుదల చేయాలని, కెమికల్స్ లీకేజీని అరికట్టాలని, రైతులెవరూ ఓఎన్జీసీకి సైట్ ఇచ్చేందుకు సిద్ధంగా లేరని రైతులకు న్యాయం చేయాలని కుంపట్ల నారాయణమూర్తి, వి.రామకృష్ణ, ఆయేషా, రాంబాబు, నాగేశ్వరరావు శ్రీనివాసరావులు కలెక్టర్‌కు అర్జీ అందించారు.

ముగ్గురు పిల్లలతో బతికేదెలా : కడలి భవానీ, కొమరగిరిపట్నం

భర్త దుర్గాప్రసాద్ అనారోగ్యంతో నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. ముగ్గురు పిల్లలు. కుటుంబాన్ని నెట్టుకు రావడంఎంతో భారంగా ఉంది. భర్త చనియపోయినందున వితంతు పెన్షన్ వస్తుందని అప్పటి నుంచి పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా, పెన్షన్ మంజూరు కాలేదు. పెన్షన్ అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని పిల్లలతో కలిసి భవానీ అర్జీఅందించింది.

వితంతు పెన్షన్ కోసం ఎదురుచూపులు : లంకే ఆదిలక్ష్మి, బోడసకుర్రు

భర్త బాపనయ్య విద్యుత్ షాక్‌తో రొయ్య చెరువుల వద్ద ఏడేళ్ల క్రితం చనిపోయాడు. ఇద్దరు పిల్లలతో కుటుంబాన్ని భారంగా నెట్టుకు వస్తున్నా. వితంతు పెన్షన్ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా. ఇంత వరకు మంజూరు కాలేదు. కమారుడు చంద్రశేఖర్ 4వ తరగతి, కుమార్తె లేఖన 2వ తరగతి చదువుతున్నారు. వితంతు పెన్షన్ మంజూరుచేసి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదిలక్ష్మి అర్జీ అందించింది.

మంచానికే పరిమితమైన కుమార్తెకు పెన్షన్ మంజూరు చేయండి : తల్లి బొలిమల మార్తరత్న గ్రేస్‌తో 19ఏళ్ల సుమిదనిస్సి, మాచవరం

పుట్టుకతోనే మెంటల్ డిజార్డర్‌గా మరుగుజ్జుగా కూతురు జన్మించడంతో భర్త విడిచిపెట్టడంతో పుట్టింటికి వచ్చి ఉంటున్నా. 19ఏళ్లుగా మంచానికే పరిమితమైన బిడ్డకు సేవ చేసుకుంటూ జీవిస్తున్నా. ఆడ బిడ్డకు పెన్షన్ మంజూరు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. సదరం సర్టిఫికెట్ ఆన్‌లైన్ చేసేందుకు కుమార్తె సుమిదనిస్సి ఐరిష్ గానీ, థంబ్ క్యాప్చర్ కాకపోవడంతో పెన్షన్ మంజూరు కావడం లేదు. అందుచేత మానవతా దృక్పథంతో బిడ్డకు పెన్షన్ మంజూరు చేయాలని మార్త రత్నగ్రేస్ కలెక్టర్‌కు అర్జీ అందించారు.

డీఎస్సీ నియామకాలకు ముందే బదిలీలు చేపట్టాలి



మంత్రి లోకేశ్‌ను కలిసేందుకు వెళ్లిన ఎంపీఎస్ ఉపాధ్యాయ సంఘ నాయకులు

అమలాపురం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2025-నియమకాలకు ముందుగానే ఎంటీఎస్ ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టి న్యాయం చేయాలని కోరుతూ ఏపీడీఎస్సీ-98 ఎంటీఎస్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చొల్లంగి కేశవ్‌కుమార్, ఫైనాన్స్ కార్యదర్శి ఎస్.రాజగోపాల్‌నాయుడులు సోమవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో ఎంటీఎస్ ఉపాధ్యాయులను వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు బదిలీలు చేశారని, కనీసం తమకు హెచ్ఆర్ఏ , ఏ ఇతర అలవెన్సులు చెల్లించరని వివరించారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీసులను 62ఏళ్లకు పొడిగించాలని, 12నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులను సొంత మండలాల్లో ఖాళీగా ఉన్న పాఠశాలలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

మారుమూల ప్రాంతాలకు రోడ్లు : ఎమ్మెల్యే గిడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మారుమూల ప్రాంతాలకు రోడ్లు ఏర్పాటు చేశామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. నగరం ఏఎంసీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్టు తెలిపారు. లూటుకుర్రు నుంచి బాడిలంకకు రూ.కోటి 20లక్షలతో రోడ్డు, పాశర్లపూడిలంకలో రూ.కోటి 20లక్షలతో రోడ్డు పనులు జరుగుతున్నట్టు తెలిపారు. త్వరలో అప్పనపల్లి ఎత్తిపోతల పథకం, అప్పనపల్లి కాజ్‌వే వంతెన, అయినవిల్లి కాజ్‌వే వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించామని, త్వరలో కార్యరూపం దాల్చుతాయన్నారు. బి.దొడ్డవరం, పెదపట్నంలంక రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండలశాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాస రాజా, భైరిశెట్టి రామకృష్ణ, నాయకులు బోనం బాబు, ఘనసాల దీపిక, మందా గాంధీ, వాసంశెట్టి కుమార్, తెలగారెడ్డి బులినాగేశ్వరరావు, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు..

జనసేన ఆవిర్భావం నుంచి పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఇచ్చినట్టు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. అంబాజీపేట ఏఎంసీ చైర్మన్ పదవి టీడీపీకి, నగరం ఏఎంసీ చైర్మన్ జనసేనకు కేటాయించామన్నారు. నగరం ఏఎంసీ చైర్మన్‌గా ఎంపికైన పెనుమాల లక్ష్మి పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారన్నారు. ఈనెల6న బుధవారం ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేస్తుందన్నారు. మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, వాసంశెట్టి కుమార్, బోనంబాబు పాల్గొన్నారు.

యానాంలో సీఎం రంగసామి పుట్టినరోజు వేడుకలు

యానాం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సీఎం ఎన్.రంగసామి 75వ పుట్టినరోజు వేడుకలు యానాంలో నిర్వహించారు. మల్లాడి అభిమాన సంఘం, యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త నిర్వహణలో వేడుకలు నిర్వహించారు. స్థానిక పాత బస్‌స్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్‌చేసి అభిమానులు స్వీట్లు పంచారు. అనంతరం మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో యానాం వృద్ధాశ్రమం, యానాం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, సీట్లను పంచారు. కార్యక్రమంలో ఎన్ఆర్ కాంగ్రెస్ యానాం అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా తీర్థ యాత్రలో ఉన్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సోమవారం సీఎం రంగసామికి ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. పుదుచ్చేరిలో ఉన్న యానాం పరిపాలనాధికారి మునిస్వామి, సిబ్బంది సీఎంను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఈవోగా వీరశంకరరావు



ఉప్పలగుప్తం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం ఎంఈవో- 1గా నూకల వీరశంకరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన కె.కిరణ్‌బాబు స్థానంలో ఆయన నియమితులయ్యారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు వీరశంకరరావును కలిసి అభినందించారు.

మంచి నాయకుడిని కోల్పోయిన జనసేన పార్టీ



జనసేన నాయకుడు శ్రీనివాస్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, సీఐ భీమరాజు, ఎస్ఐ శివ

పి.గన్నవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి సేవలం దిస్తున్న మంచి నాయకుడిని పార్టీ కోల్పోయిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. మండల ప్రధాన కార్యదర్శి పదవిని తీసుకుని నిస్వార్థంగా పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేసిన వ్యక్తి కత్తుల శ్రీనివాస్ అని కొనియాడారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కత్తుల శ్రీనివాస్ మృతదేహానికి సోమ వారం ఆయన నివాసంలో పూలమాలలతో నివాళులర్పించి అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం, పార్టీ పరంగా శ్రీనివాస్ కుటుంబాన్నిఆదుకుంటానని ఎమ్మెల్యే అన్నారు. తొలుత అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం శ్రీనివాస్ మృతదేహంతో ఎమ్మెల్యే, జనసేన నాయకులు, కార్యకర్తలు ఊరేగింపుగా పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌కు చేరుకుని బాణసంచా కాల్చారు. సీఐ ఆర్.భీమరాజు, ఎస్ఐ బి.శివకృష్ణలు మృతదేహం వద్దనివాళులర్పించారు. జనసేన కార్యాలయంలో శ్రీనివాస్ చిత్ర పటానికి ఎమ్మెల్యే, కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, బొండాడ నాగమణి, సాధానాల శ్రీవెంకటసత్యనారాయణ, ఆదిమూలం సూరయ్యకాపు, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి హెచ్ఎంలు కృషిచేయాలి



ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనీలు

కాట్రేనికోన, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు కృషిచేయాలని సమగ్రశిక్ష ఏఎంవో, ట్రైనింగ్ సెంటర్ కోర్సు కోఆర్డినేటర్ పి.రాంబాబు పేర్కొన్నారు. చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న స్కూలు లీడర్‌షిప్ ట్రైనింగ్ సోమవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా ఏఎంవో రాంబాబు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 108మంది ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. సమగ్రశిక్ష సెక్టోలర్ అధికారులు డి.రమేష్‌బాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈవోలు వైవీవీ సత్యనారాయణ, టి.శ్రీనివాస్, మాస్టర్ ఫెసిలిటేటర్స్ ఎస్.శ్రీధర్‌కృష్ణ, ఎ.రామచంద్రరావు, పోతుల శ్రీనివాసరావు, పి.శ్రీరామచంద్రమూర్తి, చిట్టినీడి నిరంజని, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో ప్రజల సంతృప్తి

అంతర్వేది, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో రాష్ట్ర ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని గోదావరి సెంట్రల్ డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. సోమవారం సఖినేటిపల్లిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగుకార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడారు. రాజోలు నియోజకవర్గంలో ఇప్పటికీ గ్రామాలను కలుపుతూ వెళ్లిన బీటీ రోడ్లను నిర్మించామని, మిగిలిన 30శాతం కూడా నిర్మిస్తామన్నారు. సూపర్-6 పథకాల్లో ఇప్పటికే పెన్షన్, ఉచితగ్యాస్, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ప్రభుత్వం అమలు చేసిందన్నారు. తాడి సత్యనారాయణ, చాగంటి స్వామి, పులగం రమేష్, కడలి మోహన్, పడాల హనుమంతు, పంగం సుధాకర్, కాంద్రేగుల చందు, చెల్లుబోయిన నాగబాబు, ఏడిద రంగ, తాడి వేణు తదితరులు పాల్గొన్నారు.

సూపర్-6 పథకాలు అమలు చేస్తోన్న కూటమి ప్రభుత్వం

మామిడికుదురు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సూపర్-6 పథకాలను కూటమి ప్రభుత్వం అమలుచేస్తుందని టీడీపీ రాజోలు నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు ఈలి శ్రీనివాస్ పేర్కొన్నారు. మామిడికుదురులో జరిగిన టీడీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో రూ.7వేలు జమ కావడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అర్హులైన వితంతు మహిళలకు కొత్తగా పెన్షన్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో సాపే ఏకాదశి, కంచి విశ్వనాథం, నామన రాధాకృష్ణ, అప్పారి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి విజయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన దృశ్యం

మలికిపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో జరిగిన సౌత్‌జోన్ జిల్లా స్థాయి అథ్లెటిక్ అసోసియేషన్ మీట్‌లో పడమటిపాలెం విద్యార్థులు ప్రతిభ కనబరిచి బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. బట్టేలంక జడ్పీ హైస్కూలు విద్యార్థులు కె.మోహన్, ఎ.గీతిక, జి.భార్గవి, పి.జ్యోతి, కె.ప్రసన్న, కె.శ్రీరామ్, కేశనపల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎస్.సత్యసాయికృష్ణ, పి.అభిలాష్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే పడమటిపాలెం హైస్కూలు విద్యార్థులు నేతల వెంకట కుమార్, అనిల్‌కుమార్, బూరుగురాజు, లీలాసత్యసాయి, లీలాజయలక్ష్మి, కముజు అనుష్క, పి.సనాశ్రీ, వి.భవ్యశ్రీ, ఎన్.మహలక్ష్మి, ఎ.జ్యోతి, యడ్ల ప్రిన్స్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ఆయా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో పలువురు అభినందించారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు అంబాజీపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. రామచంద్రపురంలో ఆదివారం జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని కె.లక్ష్మీప్రసన్న, పదో తరగతి విద్యార్థి డి.దోనేశ్వర్ వంద మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచి జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రంథాలయంలో చదువుకుని కానిస్టేబుళ్లగా ఎంపిక


అమలాపురం టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రథమశ్రేణిశాఖ గ్రంథాలయంలో ప్రతీరోజు ఉదయం 8గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల్లో ఇద్దరు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పేరూరు గ్రామానికి చెందిన ఆకుమర్తి మధుబాబు, పెన్నాడవారిపాలేనికి చెందిన పెన్నాడ ప్రవీణ్ ఉన్నారు. వీరిని ప్రథమశ్రేణిశాఖ గ్రంథాలయంలో సోమవారం గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి జీవీఆర్ఎస్ హెచ్‌కే వర్మ ఆధ్వర్యంలో పాఠకులు, నిరుద్యోగులు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పులిదిండి వెంకటేష్, పిల్లా సతీష్, పితాని రాజ్‌కుమార్, పోతుమూడి కుమార్, మాకే రవితేజ, మట్టపర్తి బాలు, యర్రంశెట్టి ధర్మారావు, చిక్కాల రవిశంకర్, పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, ఆకుల భవానీ తదితరులు పాల్గొన్నారు.

'విద్యాశక్తి'ని నిర్బంధం చేస్తే బహిష్కరిస్తాం

జిల్లా శాఖ హెచ్చరిక

అమలాపురం టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల్లో విద్యాశాఖ నిర్వహిస్తున్న విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధంగా నిర్వహించాలని చేస్తే బహిష్కరిస్తామని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎంటీవీఏఎస్ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి దొరబాబు హెచ్చరించారు. ఫ్యాప్టో జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడారు. విద్యాశక్తి కార్యక్రమం స్వచ్ఛందంగా నిర్వహించాలని విధి విధానాలు ఉన్నప్పటికీ జిల్లాలోని కొందరు అధికారులు, ప్రధానోపాధ్యాయులు నిర్బంధంగా చేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని విమర్శించారు. జూలై 31నాటికి కార్యక్రమం పూర్తయినప్పటికీ ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించాలని సర్క్యులర్ విడుదల చేసిందన్నారు. పాఠశాలల్లో బోధనేతర పనులతో ఉపాధ్యాయులకు విద్యాబోధన మరింత భారంగా మారిందన్నారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని అదనంగా 6 నుంచి 9వ తరగతి వరకు నిర్బంధంగా నిర్వహించాలని చూస్తే ఫ్యాప్టో జిల్లాశాఖ పక్షాన బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు.

బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడిగా బాషా



అమలాపురం టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బీజేపీ అమలాపురం పట్టణశాఖ అధ్యక్షుడిగా అయ్యల భాస్కర రావు (బాషా) నియమితులయ్యారు. బీజేపీ కార్యకర్తల సమావేశం అమలాపురంలో నిర్వహించారు. బూత్ కమిటీ అధ్యక్షుడు, క్రియాశీలక సభ్యులు, నాయకుల ఏకగ్రీవంగా బాషాను ఎంపిక చేశారని ఎన్నికల పరిశీలకుడు మాలే శ్రీనివాసనగేష్ తెలిపారు. ఎన్నికల ప్రతినిధిగా బీఎస్ మూర్తి వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ తదితరులు అభినందించారు.

'స్మార్ట్ మీటర్లు బిగించొద్దు'

మలికిపురంఆగస్టు4(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం మలికిపురంలో జరిగిన సీపీఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలపై విద్యుత్ భారాలను మోపడానికి అదానీతో చేసుకున్న ఒప్పందాల మేరకు స్మార్ట్ మీటర్లను తీసుకువస్తున్నారని, వాటిని అడ్డుకోవాలన్నారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు బిగించకుండా పగలకొట్టాలని పిలుపునిచ్చిన మంత్రి లోకేశ్ కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం తగదన్నారు. గెడ్డం ప్రభాకరరావు, చెల్లుబోయిన తాతారావు, దేవ సురేష్‌బాబు పాల్గొన్నారు.

గూడాల సహకార సొసైటీ అభివృద్ధికి కృషి

అల్లవరం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం, గూడాల సహకార సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్ పోలిశెట్టి భాస్కరరావు అన్నారు. గూడాల సొసైటీ చైర్‌పర్సన్‌గా భాస్కరరావు, డైరెక్టర్లగా నూకల రమణ, వస్కా కృష్ణ సోమవారం ప్రమాణ స్వీకారంచేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, యాళ్ల నాగసతీష్, వేగిరాజు వెంకట్రాజు, కంకిపాటి గోపి, లింగోలు పండు, బొలిశెట్టి కొండ, యాళ్ల బ్రహ్మానందం, ఆకుల లక్ష్మణరావు, సాధనాల నాగబాబు, నడింపల్లి సుబ్బరాజు, బండిగుప్తాపు పాండురంగ, కంకిపాటి వీర బాబు, అల్లు సత్తిబాబు, సీఈవో కలిగినీడి సుభాషిణి పాల్గొన్నారు.

డ్రెయిన్ డ్రెడ్జింగ్ కోసం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే దేవ



పాలకొల్లులో మంత్రి రామానాయుడుతో సమావేశమైన ఎమ్మెల్యే దేవ, కూటమి నాయకులు

మలికిపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం డ్రెయిన్ పూడిక పనులు ఎనిమిది కిలోమీటర్ల మేర చేపట్టకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కేశనపల్లి పరిసర గ్రామాల కూటమి నాయకులతో కలిసి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకు వెళ్లారు. డ్రెయిన్ డ్రెడ్జింగ్ మిగిలిపోయిన ప్రాంతం వల్ల డ్రెయిన్ పొంగి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని మంత్రి దృష్టికి తెచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలనకు రావాలని మంత్రిని కోరానన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసి డ్రెయిన్ సమస్య పరిష్కార దిశగా ముందుకు వెళ్లనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

అత్యధిక లాభాలు పొందొచ్చు

పి.గన్నవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ పంట ద్వారా అత్యధిక లాభాలను పొందవచ్చని ఉద్యానశాఖ అధికారిణి శైలజ రైతులకు సూచించారు. లంకలగన్నవరం కాటా వద్ద సర్వేసాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేటు లిమిటెట్, ఉద్యానశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీని, ఆయిల్‌పామ్ పంటపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, కంపెనీ జనరల్ మేనేజర్ కెజె ప్రభాకర్, ఏజీఎం వీరభద్రం, రైతులు ఆరుమిల్లి సత్యసాయిబాబు, ఆరుమిల్లి సుబ్బా రావు, యన్నాబత్తుల వెంకటేశ్వరావు, చిట్టాల రామజోగేశ్వరరావు, మేనేజర్ వెంకటకృష్ణ, కలెక్షన్ సెంటర్ ఇంచార్జ్‌లు హరికృష్ణ, రాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక జగన్నాథ పండితరాయులు

అమలాపురం టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా జగన్నాథ పండితరాయులు నిలుస్తారని గ్రంథ సమీక్షురాలు ఓరుగంటి సీత పేర్కొన్నారు. జగన్నాథుని రచనల్లో ప్రేమ, క్షమ, పశ్చాత్తాపం, విముక్తి వంటి విలువలు స్పష్టంగా కనిపిస్తాయన్నారు. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, మహిళా క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి నేతృత్వంలో సోమవారం సాహితీ సమావేశం నిర్వహించారు. విహారి (జేఎస్ మూర్తి) రచించిన జగన్నాథ పండితరాయులు నవలపై పుస్తక సమీక్ష నిర్వహించారు. అవధాని జాన దుర్గామల్లికార్జునరావు, ఆకొండి ధన్వంతరి, వాసంశెట్టి బలరామకృష్ణ, డాక్టర్ గోకరకొండ నాగేంద్రరావులు మాట్లాడుతూ జగన్నాథుని శీల సంపదను సాహితీ లోకంలో ఆయన చేసిన కృషిని వివరించారు. వ్యాఖ్యాతగా పుత్సా కృష్ణ కామేశ్వర్ వ్యవహరించారు. అమలాపురానికి చెందిన వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, ఓరుగంటి సీతలను క్లబ్ తరపున సత్కరించారు. పేరి లలిత, గోగేటి గంగాధరరావు, నూకల సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాఖపట్నం వెళ్లి పింఛన్ అందజేత



మామిడికుదురు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి గ్రామానికి చెందిన మల్లవరపు శేషారావు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చికిత్స తీసుకుంటున్నాడు. దీంతో ఆగస్టు నెలలో ఇచ్చే పెన్షన్‌ను పాశర్లపూడి వెల్ఫేర్ అసిస్టెంట్ ఎ.కల్యాణ్ విశాఖపట్నం వెళ్లి అతనికి వచ్చే రూ.10వేలు పెన్షన్‌ను అందించాడు. దూరంలో ఉన్న పెన్షన్‌దారునికి పెన్షన్ అందజేసిన సచివాలయ ఉద్యోగిని సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, పంచాయతీ కార్యదర్శి జి.వాసు, స్థానిక నాయకులు చుట్టుగుళ్ల కిశోర్, గంధం భాస్కర్, మల్లాడి విష్ణు అభినందించారు.

కల్యాణ మండపం ప్రారంభోత్సవం

ముమ్మిడివరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.20లక్షల దాతల విరాళంతో నూతనంగా నిర్మింపచేసిన కల్యాణ మండపాన్ని సోమవారం ప్రారంభించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చంద్రమౌళి, బ్రహ్మశ్రీ గౌరీపతిశాస్త్రి, వెలువలపల్లి వీరవెంకటసత్యనారాయణశాస్త్రి వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకుడు కొండవీటి రాంబాబుశర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జంధ్యాల శివకుమార్, కార్యదర్శి దివి విజయ్, సురేష్‌వర్మ, బాబిలతో పాటు పలువురు పాల్గొన్నారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణ మండప ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వెంకటరమణ

అయినవిల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బీజేపీ అయినవిల్లి మండల కార్యకర్తల సమావేశం కుడుపూడి చంద్రశేఖర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. మండలశాఖ నూతన అధ్యక్షుడిగా యనమదల వెంకటరమణను బూత్ కమిటీ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యులు, నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల పరిశీలకుడు మాలే శ్రీనివాసనగేష్ తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఎన్నికల అధికారులుగా చీకురుమెల్లి శ్రీనివాసరావు, చీకురుమెల్లి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా మోర్చా ప్రతినిధులు ఆకుమర్తి బేబిరాణి, యనమదల రాజ్యలక్ష్మి, నాయకులు కొవనాతి శ్రీరామచంద్రమూర్తి, మోకా ఆదిలక్ష్మి, ముద్రగడ రామకృష్ణ, వేటుకూరి సత్తిరాజు, అడపా వీరేశ్వరరావు తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడిని సత్కరించారు.

సంక్షేమ పథకాలపై ఆరా

ఉప్పలగుప్తం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాంలో వైసీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటికి వెళ్లి ఆరా తీశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైసీపీ జిల్లా కార్యదర్శి పొగాకు శ్రీను ఆధ్వర్యంలో శ్రీకాంత్‌కు స్వాగతం పలికారు. పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వంగా గిరిజానాగకుమారి, మోటూరి సత్యంకాపు, లంకే శ్రీనుపాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ

అల్లవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు గ్రామంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో మలేరియా, డెంగ్యూ, బోధకాలు నివారణపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతీఒక్కరూ ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, చింతం శ్రీనివాస్, ఎంపీటీసీ దొమ్మేటి శ్రీశాంతిభవానీ, సూపర్‌వైజర్ సాపే సత్యనారాయణ, వనచర్ల సత్యనారాయణ, నల్లి విజయ, రాపాక సౌమ్య, పంచాయతీ కార్యదర్శి బి.ఆదిశంకరం పాల్గొన్నారు.

గెద్దాడలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

రాజోలు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు మండలం గెద్దాడలో ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని రాజోలు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో న్యాయవాది యాలంగి రమేష్ రాజోలు ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. మామిడికుదురు మండలం పాశర్లపూడి నుంచి రాజోలు మండలం శివకోటి వరకు ఉన్న నూతన జాతీయ రహదారి 216రోడ్డు మార్గంలో క్రాసింగ్ వద్ద రోడ్డు ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో ప్రయాణికులు అనేక ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఈనూతన హైవేపై భారీ వాహనాలు, బస్సులు, లారీలు, వాహనదారులు ప్రయాణించడం వల్ల ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అమలాపురం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందినట్టు అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. అమలాపురం మండలం భట్నవిల్లి గ్రామానికి చెందిన పెనుమాల దుర్గాప్రసాద్(21) మోటారుసైకిల్‌పై ఆదివారం రాత్రి 10గంటల సమయంలో ముమ్మిడివరం మండలం అనాతవరంలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. స్థానిక వనువులమ్మతల్లి ఆలయం వద్దకు వచ్చేసరికి జాతీయ రహదారిపై కుక్క అడ్డు వచ్చింది. దీంతో మోటారుసైకిల్ అదుపుతప్పి దుర్గాప్రసాద్ రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు, బంధువులు అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం చికిత్స పొందుతూ దుర్గాప్రసాద్ మృతిచెందినట్టు ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపాడు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ, కంప్యూటర్ ఆపరేటర్ అసిస్టెంట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణాసుధాకర్ తెలిపారు. యానాం ప్రాంతానికి చెందిన మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఈనెల31వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఐటీఐలో సంప్రదించాలన్నారు.

దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి

అంబాజీపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దాతలు సహకారంతో పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని హెచ్ఎం ఏఎల్ వరప్రసాద్ అన్నారు. ఇసుకపూడి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం.నాగేశ్వరమౌళి దాతలకు వివరించారు. దీంతో విశ్రాంత డ్రాయింగ్ టీచర్ ఆకెళ్ళ మంగళగిరిశాస్త్రి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.50వేలతో హైస్కూల్‌లో మినీ ఆర్వోప్లాంట్‌ను వితరణ చేశారు. హెచ్ఎం వరప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ పళ్ళ స్వామినాయుడు దాతల సమక్షంలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. దాతలను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

ఆన్‌లైన్ పనులు చేయలేకపోతున్నాం

• సిగ్నల్స్ అందక అంగన్‌వాడీల అసంతృప్తి • సెల్‌ఫోన్లు అందజేత

ద్రాక్షారామ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పనులు చేయలేమని అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం సీడీపీవో కార్యాలయంలో తమ సెల్‌ఫోన్లను ఇచ్చేశారు. అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు వీరలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు ఇచ్చిన సెల్‌ఫోన్లు పోషణ ట్రాక్టర్, బాల సంజీవని యాప్స్ అమలుకు సపోర్టు చేయడం లేదన్నారు. లబ్ధిదారులకు ఫొటో క్యాప్చర్, ఓటీపీ, ఎఫ్ఆర్ఎస్ ద్వారా సరుకులు ఇవ్వాలనే నిబంధన కారణంగా అంగన్‌వాడీలు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరుకులన్నీ ఒకసారి రాకపోవడం, నెట్ సిగ్నల్ లేకపోవడం, సర్వర్ పనిచేయకపోవడం తదితర కారణాలతో లబ్ధిదారులు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలిపారు. అన్ని యాప్‌లను ఒకే యాప్‌గా మార్పు చేయాలన్నారు. 5జీ ఫోన్లు ఇవ్వాలని కోరుతూ తమకు ఇచ్చిన సెల్‌ఫోన్లను సీడీపీవో కార్యాలయంలో ఇచ్చేశామన్నారు. మంగళవారం నుంచి ఆన్‌లైన్ వర్కు చేయలేమని, అంగన్‌వాడీ సెంటర్‌లో హాజరు, లబ్ధిదారులకు ఆహార పంపిణీ, రికార్డులు రాస్తామని తెలిపారు. ఈ పనులు చేయడమే ఇబ్బందిగా ఉంటే ప్రధానమంత్రి మాతృ వందన పథకం అంగన్‌వాడీలకు కొత్తగా అప్పగించారని వారు తెలిపారు. అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని, హెల్పర్లకు పదోన్నతి కల్పించి గైడెన్స్ రూపొందించాలని వారు డిమాండు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ల నాయకులు శ్రీదేవి, సూర్యకుమారి, దుర్గ, వెంకట రత్నం, చంద్రకళ, దేవి, జహేర, వర్మ తదితరులు పాల్గొన్నారు.


సీడీపీవో కార్యాలయంలో సెల్‌ఫోన్లను అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

9న విజయదుర్గా పీఠంలో శ్రావణ పౌర్ణమి పూజలు

రాయవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఈనెల 9న శ్రావణ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. సోమవారం వెదురుపాకలో ఆయన మాట్లాడుతూ పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, అనంతరం ప్రత్యేక అలంకరణ జరిపి భక్తులతో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. పీఠంలో ఉన్న భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, శ్రీదేవి భూదేవి సమేత విజయ వేంకటేశ్వర స్వామికి తులసిదళ అర్చనలు, నవగ్రహ, నక్షత్ర హోమం పూర్ణాహుతి జరుగుతుందన్నారు. అనంతరం విజయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అన్న సమారాధన జరుగుతుందని అడ్మినిస్ట్రేటర్ తెలిపారు.

ముంపు సమస్య పరిష్కారానికి శ్రీకారం

ఆత్రేయపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): లొల్ల-పలివెల మురుగు కాలువ పూడికతీత పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషి మేరకు కలెక్టర్ మహేష్ కుమార్ రూ.19.40లక్షలు మంజూరు చేశారు. వీటి పనులను సోమవారం ప్రాజెక్టు వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు ప్రారంభించారు. కొన్నేళ్లుగా బ్యాంకు కెనాల్ ఎడమగట్టు ఆయకట్టు రైతులకు ముంపు సమస్యగా మారింది. కూటమి ప్రభుత్వం రూ2.50 కోట్లతో సైఫాన్ నిర్మాణం చేపట్టారు. ముంపు నీరు ముందుకు వెళ్లే మార్గం లేకపోవడంతో లొల్ల-పలివెల దేవరబంద డ్రైనేజీ పూడికతీత పనులకు నిధులు మంజూరు కావడంతో ముంపు సమస్య పరిష్కారం కానుంది. వీటి పనులను డ్రైనేజీ ఏఈ విజయలక్ష్మి దగ్గరుండి పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు పెండెం వెంకన్న, బందెల శ్రీను, గుళ్లపల్లి శ్రీను, త్రినాధరావు, మండపాక సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలి వద్ద డ్రైనేజీ శుభ్రం చేసే పనులను ప్రారంభిస్తున్న ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ నరసింహారావు


వెదిరేశ్వరం జడ్పీ పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రావులపాలెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వెదిరేశ్వరం జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాంప్రసాద్, ఈశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల రామచంద్రపురంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. అండర్-16 విభాగంలో నామాల జ్ఞానేశ్వర్ జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానం, షాట్‌పుట్‌లో తృతీయస్థానం సాధించగా మారే లోకేశ్‌కుమార్ జావెలిన్ త్రోలో ద్వితీయస్థానం సాధించారు. అండర్-14 విభాగంలో పితాని మహిశ్రీ 60 మీటర్ల పరుగు పందెంలో తృతీయస్థానం సాధించాడని వారు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈవోలు నాగకుమార్, శ్రీనివాసరాజు, పీడీ వై.ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ మారే సుబ్బాయమ్మ, మారే శ్రీనివాస్ అభినందించారు.


ఎంపీడీవో కీర్తి స్పందనకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

గ్రామాల్లో ఫ్లెక్సీల తొలగింపు చర్యలు చేపట్టాలి

రాయవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో రాజకీయ పార్టీలు, వివిధ వర్గాల ఫ్లెక్సీలపై, కొత్త ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని వాటి తొలగింపు చర్యలు చేపట్టాలని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందనకు వినతిపత్రం ఇచ్చారు. ఆయా గ్రామాల్లో ఫ్లెక్సీల వల్ల అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాత్రాతి జానకి రాంబాబు, కొత్తపల్లి శ్రీదేవి, నరాల రాంబాబు, చిరట్ల సుబ్బారావు, చింతా తమ్మిరెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈరెళ్ల కృష్ణమూర్తి, అంగర జనార్థన్, శాకా సత్యదేవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నో బ్యాగ్ డేను అమలుచేయాలి

మండపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం నాడు నో బ్యాగ్ డేను అమలు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పక్కన పెట్టిన పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పిల్లల మనోవికాసానికి ప్రభుత్వం అమలు చేసే నో బ్యాగ్ డేను అమలు చేయని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆయా దేవాలయాల్లో ప్లాస్టిక్ కవర్లను వాడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కాలుష్యం పెరిగి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ కోసం యుద్ధ ప్రాతిపదికన ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమి వేయాలని ప్రజలను కోరారు.

రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ యువకుడి మృతి

అమలాపురం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. భట్నవిల్లి గ్రామానికి చెందిన పెనుమాల దుర్గాప్రసాద్(21) మోటారు సైకిల్‌పై ఆదివారం రాత్రి అనాతవరంలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. వనువులమ్మతల్లి ఆలయం వద్దకు వచ్చేసరికి కుక్క అడ్డురాగా, బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. వెంటనే స్థానికులు, బంధువులు అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు.


భూమిపూజ చేస్తున్న ఈవో వీర్రాజు చౌదరి

నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద టాయిలెట్స్ నిర్మాణానికి శ్రీకారం

ఆలమూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చింతలూరు గ్రామంలోనున్న నూకాంబిక అమ్మవారి దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం రూ.24లక్షలతో 8 టాయిలెట్ బ్లాకులు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి సోమవారం ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు

కె.గంగవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్.కె.జానీ బాషా చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బ్రహ్మపురి గ్రామంలో శనివారం మంతెన సత్యనారాయణమ్మ మెడలో మూడు కాసుల బంగారు గొలుసును ఆలమూరు గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరబాబు దొంగలించుకుపోయాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

కె.గంగవం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కూళ్ల గ్రామంలో మహిళపై దాడి చేసి వ్యక్తిని అరెస్టు చేసినట్టు పామర్రు ఎస్ఐ జానీబాషా చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నంపల్లి సరితకు ఆమె దగ్గర బంధువు నామాడి శాంతిరాజు, అతని తల్లి రామలక్ష్మికి గతంలో వివాదం ఉంది. ఇటీవల సరితను, శాంతిరాజు డబ్బులు డిమాండ్ చేయగా, ఆసమయంలో వారిద్దరికి వాగ్వివాదం జరిగింది. దీంతో శాంతిరాజు ఆమెపై దాడిచేసి గాయపరిచాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శాంతిరాజును అరెస్టు చేసినట్టు ఎస్ఐ జానీబాషా చెప్పారు.

ఆలమూరు ఎంఎస్‌వోగా సుబ్బరాజు



ఆలమూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలానికి ఫుల్ అడిషనల్ ఛార్జ్ (ఎఫ్ఏసీ)తో స్థానిక డిప్యూటీ తహసీల్దార్ టీ. సుబ్బరాజు నియమితులయ్యారు. సోమవారం సివిల్ సప్లయి జిల్లా కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంతవరకు విధులు నిర్వహి స్తున్న సీహెచ్ గాయత్రి పద్మ రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు ఎమ్మెస్‌వోగా నియమించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ గతంలో మండపేట పరిధిలో ఎంఎస్‌వోగా చేసిన అనుభవం ఉందన్నారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటూ ముందుకు వెళతామని ఆయన తెలిపారు.


సత్యవాడలో వరసిద్ధి వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ దృశ్యం

సత్యవాడలో ఘనంగా వరసిద్ధి వినాయకుని ప్రతిష్ఠ

కె.గంగవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవాడ గ్రామంలో నిర్మించిన ఆలయంలో వరసిద్ధి వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. గతంలో పామర్తి కుటుంబీకులు గణపతి ఆలయాన్ని నిర్మించారు. అది జీర్ణస్థితికి రావడంతో వారు నూతన ఆలయాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో వరసిద్ధి వినాయకుడు, లక్ష్మీదేవి, సరస్వతీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో పామర్తి సుబ్బారావు, ప్రభాకర రామారావు, గోవిందరాజు, రామారావు, రాజా, ఆనంద రాయుడు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. వేద పండితులు తాతపూడి కేశవాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు మూడు రోజులుగా ఆలయ ప్రాంగణంలో పలు పూజలు, హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం అన్న సమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఆత్రేయపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అమ్ముతున్న షాపుపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ర్యాలికి చెందిన మద్దుల వెంకటేశ్వరరావు తన కిరాణా షాపులో రేషన్ బియ్యాన్ని అమ్ముతున్నారు. దీంతో అతని వద్ద ఉన్న 340 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.



లొల్ల లాకుల వద్ద తుప్పుపడుతున్న పాత ఇనుప సామగ్రి. పక్క చిత్రంలో పేరవరం పంపింగ్ స్కీమ్ వద్ద తుప్పుపడుతున్న పాత మోటార్లు

ఇలా..తుప్పుపట్టిపోవాల్సిందేనా?

• వృథాగా పడి ఉన్న లాకుల గేట్లు, మోటార్లు • నిర్లక్ష్యం చూపుతున్న ఇరిగేషన్ అధికారులు

ఆత్రేయపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ డెల్టాకు తాగునీరు అందించే లొల్ల లాకుల వద్ద పాత ఇనుప సామగ్రి తుప్పుపట్టి మట్టిలో కలిసిపోతూ నిరుపయోగంగా అవుతున్నాయి. పేరవరం ఎత్తిపోతల పథకం వద్ద 2015లో మోటార్లు, పైపులైన్లు శిథిలస్థితికి చేరుకోవడంతో వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. తొలగించిన మోటార్లు, పైపులైన్‌లను పంపింగ్ స్కీమ్ ఎదురుగా పడవేశారు. సుమారు పదేళ్లు కావస్తున్నా ఎండ, వానల వల్ల తుప్పపడుతూ మట్టిలో కలిసిపోతున్నాయి. లొల్లలాకుల వద్ద మూడు ప్రధాన కాలువలకు అమలాపురం, పి.గన్నవరం, ముక్తేశ్వరం లాకులకు సంబంధించి ఇనుప షట్టర్లు అమర్చారు. తీసివేసిన ఆయా సామగ్రిని కార్యాలయం చెంతనే నిర్లక్ష్యంగా పడేశారు. దీంతో అవి రోజురోజుకు తుప్పపట్టి మట్టిలో కలిసిపోతున్నా అధికార యంత్రాంగం ఉదాసీనత కనబరుస్తోంది. లక్షలాది రూపాయల విలువైన ఇరిగేషన్‌కు చెందిన ఆయా సామగ్రిని వేలం నిర్వహిస్తే ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వస్తుందని పలువురు సూచిస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి రోజు రోజుకు కనుమరుగవుతున్నాయి. మరోవైపు రాత్రివేళల్లో ఇనుము దొంగిలించే ముఠా అందినకాడికి ఎత్తుకుపోతున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు ఆయా సామగ్రిని వేలం వేసి లాకుల వ్యవస్థకు వాటి నిధులను ఉపయోగించాలని పలువురు సూచిస్తున్నారు.



మండపేటలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


ఆలమూరులో బాలింతలకు సూచనలు ఇస్తున్న సూపర్‌వైజర్ అరుంధతి

తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష

కపిలేశ్వరపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఐ.మాణిక్యం అన్నారు. సోమవారం వడ్లమూరు గ్రామంలో ప్రాజెక్టు అధికారి ఎ.గజలక్ష్మి ఆదేశాల మేరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత వాటి ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌సీ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, గర్భవతులు, బాలింతలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

శిశువులకు తల్లిపాలు అమృతం

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): శిశువుకు తల్లిపాలు అమృతంతో సమానమైనవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.అరుంధతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నర్సిపూడి సెక్టార్ పరిధిలోని కలవచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సీహెచ్ వెంకటలక్ష్మి, వై.సుశీల, ఏఎన్ఎం కె.వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మండపేట, మెర్నిపాడులో

మండపేట, (ఆంధ్రజ్యోతి): మండపేటతోపాటు, మెర్నిపాడు గ్రామాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహకులు నిర్వహించారు. తల్లిపాల ప్రాధాన్యత వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వటం వల్ల చిన్నారులకు ఆరోగ్యంతోపాటు తల్లికి రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ఉంటుందన్నారు. ర్యాలీలో అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం మండలం వడ్లమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

రైతుల శ్రేయస్సు కోసం సొసైటీలు పనిచేయాలి

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం సహకార సొసైటీలు పనిచేస్తూ ప్రజల మన్ననలను పొందాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం పడమరఖండ్రిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సొసైటీ అధ్యక్షులుగా పుత్సల శ్రీనివాస్, సభ్యులుగా మాత వెంకటరమణ, కర్రి పార్వతి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి సహాయ, సహకారాలు అందించాలన్నారు. నూతన చైర్మన్ పుత్సల శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బలవరెడ్డి సత్తిబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ పువ్వల చిట్టిబాబు, ముత్యాల వెంకట్రావు, అల్లూరి రామకృష్ణ చౌదరి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, తిరునాతి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, వల్లూరి వీరబాబు, కొండేటి నాగేశ్వరరావు, తదితరులతో పాటు సొసైటీ సీఈవో ఎం. శ్రీనివాస్, పలువురు గ్రామస్తులు, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.


పడమరఖండ్రిక నూతన కమిటీ చైర్మన్, సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

ఆర్థిక ప్రగతికి చిహ్నాలు రహదారుల నిర్మాణం



కొత్తపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లో ఆర్థిక ప్రగతికి చిహ్నాలుగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రహదారుల నిర్మాణం శుభసూచికమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. సోమవారం కొత్తపేటలో ఆయన మాట్లాడుతూ కేంద్ర సహకారంతో రాష్ట్ర రోడ్లకు మహర్దశ వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషికి తగ్గట్టుగా జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరి రాష్ట్రానికి సుమారు రూ.26వేల కోట్ల ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వం లో రోడ్లన్నీ అధ్వానంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రం సహకారంతో అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు.


కోరుమిల్లిలో విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీవైఈవో రామలక్ష్మణరావు

మత ప్రచారం ఫిర్యాదుపై డీవైఈవో విచారణ

కపిలేశ్వరపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుమిల్లి సెయింట్ మదర్ స్కూల్‌లో మత ప్రచారం జరుగుతోందని అందిన ఫిర్యాదుపై సోమవారం రామచంద్రపురం డీవైఈవో రామలక్ష్మణరావు పాఠశాలలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఫిర్యాదు చేసిన వారి నుంచి ఆయన సమాచారం సేకరించారు. పాఠశాల తరగతి, టాయ్‌లెట్లను ఆయన పరిశీలించారు. విచారణ అంశాలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో కె.తాతారావు, ఎంఐఎస్ సీఆర్‌ఎంటీ సిబ్బంది పాల్గొన్నారు.


మాచరలో విద్యార్థినులకు ఏకరూప దుస్తులు అందజేసిన దాతలు

ఇంటర్ విద్యార్థినులకు ఏకరూప దుస్తులు అందజేత

కపిలేశ్వరపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచర ప్లస్ టు ఉన్నత పాఠశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థినులకు దాతల సహకారంతో సోమవారం ఏకరూప దుస్తులను అందజేశారు. పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాతలు అలూమిని సభ్యులు మట్టపర్తి సత్యనారాయణ, గొడవర్తి భగవన్నారాయణ, వీధి కామరాజు, దిగుబడి శ్రీరాములు సహకారంతో రెండు జతల చొప్పున 22 మంది విద్యార్థినులకు వాటిని పంపిణీ చేశారు. దాతలను హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో అలూమిని సభ్యులు గుడాల వెంకటరమణ, ప్లస్ టు ఉపాధ్యాయులు, నూకపెయ్యి వెంకటరావు, షిరిడీసాయి, రాయుడు ఉదయ్ కృష్ణ, జీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రైతులు పంట నమోదు చేయించుకోవాలి

రాయవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ మండల అధికారి కేవీస్ రమేష్ కుమార్ తెలిపారు. సోమవారం రాయవరం రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు ఉంటే రైతు సేవా కేంద్రంలో నమోదు చేసేందుకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చిందన్నారు. కౌలు రైతులకు కనీసం ఒక ఎకరం, సాగుదారు పత్రం పొందాలని తెలిపారు. పంట నమోదు చేసుకున్న కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. ఆయా గ్రామాల్లోని రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు గురించి సర్వే నిర్వహిస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.